శ్రీరస్తు.

మరణము-భువర్లోకము

మంత్రిప్రగడ నరసింహముచే

రచియింపఁబడియె.

మొదటికూర్పు 1000 ప్రతులు.

శ్రీ చింతామణిముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1924.

—

దీనివెల 8 అణాలు.

To HER,

who in life has been my

incarnation of Love,

and in death

is still with me,

guiding and inspiring

from above.

FOREWORD.

With pleasure I accept the duty of writing a few words of introduction to this book. "Good wine needs no bush" yet must the vintner, ere he is known, state that he has wine to sell. Even so with the wine of the spirit. It justifies itself when tasted, but the first tasting must be offered. My humble office is merely to say " Taste. "

The author has done his work well. The subject in all its aspects has been well touched with a clear and impressive exposition. Demon Death has been freed of its characteristic horrible hideousness and excruciating sting, which the ordinary worldly man sees and feels. He has shown it to be merely the opening to a new life with renewed powers. It is merely the changing of a carriage for reaching the next stage in our spiritual journey, just as changing trains is incidental even to an ordinary railway journey. Chapters VI, VII and VIII are very interesting. The reader will find his own mind well stimulated and passified-the true object of the book.

May it serve the useful purpose of finding "Shanti" which is its key-note. May every reader realise that wherever there is a domestic calamity

there is the unfailing comforter in this book. Every family must have this soothing balm or painkiller ready against contingencies.

Om! Shantihi, Santihi, Santihi.

Cocanada,
Dated 1-11-1924 } PeddiBhotla Subbarayudu.

పీఠిక.

—:o:—

ఆప్తులెవరైననూ మృతినొందినపుడు వారిబంధువులం
దరునూ అనివార్యమగుదుఃఖమున మగ్నులైయుండగా నట్టి
వారికి దుఃఖోపశమనముఁగలిగించుగ్రంథములు మనయాంధ్ర
భాషయందు నాకుఁదెలిసినంతవరకు గానరావు. భారతము
నందలిశాంతిపర్వము గొంచెము మనశ్శాంతిని గలిగింపవచ్చు
నుగాని యది సామాన్యజనులు తెలుసుకొనుటకు సులభసా
ధ్యము గాదు. దుఃఖదినములలో సామాన్యముగాఁజదువబడు
గరుడపురాణము దుఃఖాధిక్యతనుగలిగించునుగాని శాంతిని
గలుగజేయదనియు, నది జదువదగినగ్రంథము కాదనియు నా
యభిప్రాయము. అందరునూ జదువుకొనుటకువీలుగలుగునట్లు
సులభశైలిని వచనరూపముగా నొకచిన్నపుస్తకముండినచోఁ
జాలనుపయుక్తముగానుండును. నేను ఘోరమగుదుఃఖములో
మగ్నుడనై మిన్నుమన్నుగానకయున్నపుడు గొన్నియాంగ్లేయ
గ్రంథములనుజదివి చాలామనశ్శాంతి నొందగలిగితిని. ఆంధ్ర
భాషయందిట్టిగ్రంథములు లేకపోవుట గొప్పకొరంతయని నా
కప్పుడుదోచెను. ఈకొరంతఁదీర్చుసామర్థ్యము నాకులేకపోయి
ననూ. నిట్టిగ్రంథములయావశ్యకత నామనమునబాగుగా
నాటుటచే, నేనాంగ్లేయగ్రంథములలోజదివినవిషయములను
సంక్షేపముగా నీచిన్నిపుస్తకమున వ్రాయబూనితిని. దీని

ముఖ్యోద్దేశము దుఃఖసముద్రమునమునిగినవారి నోదార్చి మనశ్శాంతిఁగలిగించుటయే. ఇంగ్లీషునందలి గ్రంథములు జదువుకొనలేనివారికిది యత్యంతోపయోగముగానుండును. గ్రంథబాహుళ్యము నాయభిప్రాయముగాకపోవుటచే బహుసంక్షిప్తముగా వ్రాసినను, ముఖ్యాంశముల నిందిమిడ్చితిని. కావుననిది దుఃఖోపహతులగువారికి శాంతినిగలిగించునని నానమ్మకము. ఇందలివిషయములనేకులకుఁ గ్రొత్తగాఁ గనుపించినను నివి గుప్తహైందవయోగశాస్త్రమునకును, తత్వజ్ఞానమతమునకును (Theosophy), క్రైస్తవులలోనొక తెగవారగు రాసిక్రూషియనులమతమునకును (Rosicrucians) సమ్మతములై యున్నవి. మరియు నివి దివ్యశక్తులుగలవారిచేఁ బ్రత్యక్షముగాఁ గనిపెట్టబడినయంశములై యున్నవి. భాషాపరిజ్ఞానములేనందున చక్కని శైలిలో వ్రాయలేకపోయినను, విషయములైనా బాగుగా వెల్లడింపగలిగితినో లేదో యను సంశయము బాధించుచున్నది.

రాజమండ్రి,
1—11—1924.

మంత్రిప్రగడ నరసింహము.

శ్రీరాములు.

మరణము - భువర్లోకము.

మొదటి ప్రకరణము.

మరణము సంభవించినపుడు దుఃఖము కలుగుటకు కారణములు:—

శ్లో॥ జాతస్యహి ధ్రువో మృత్యుః ।
ధృవం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యే ర్థే ।
న త్వం శోచితు మర్హసి॥ భగవద్గీత_2_27.

"పుట్టినవానికి చావు నిశ్చయము. చచ్చినవానికి పుట్టు కయూ నిశ్చయము. ఆకారణమువలన, తప్పింప శక్యము కానివిషయమై నీవు దుఃఖించుటకు తగవు"

అని జెప్పబడిన శ్రీభగవంతునివాక్యానుసారముగా, జన్మించిన మనుష్యాదిసమస్తజంతుజాలమునకును మరణము నిశ్చయమై యున్నది. బాగుగా యోచించిచూడగా మరణమంతనిశ్చయ విషయము ప్రపంచమున మరి యింకేదియును లేదు. ఒక శిశువు జనియించినవెంటనే మనము "ఈశిశువునకు మరణము నిశ్చయము" అనుసంగతి రూఢిగా చెప్పగలము. అనగా

ఆశిశు వొక సంవత్సరము జీవించిననూ, గాక యిరువదేండ్లు జీవించిననూ, గాక నూరువత్సరములు జీవించిననూ, తుదకు మరణము నిశ్చయమను సంగతి యాశిశువు జనియించినతోడనే మనకు తెలిసినవిషయమై యున్నది. మరియు, మృత్యువు అనివార్యమునూ నై యున్నది. మన మెన్ని ప్రయత్నములు చేసినను, యెందరుదేవతలకు మొక్కిననూ, యెట్టియాపన్నత్యదశ ననుభవించువారమయిననూ మృత్యుముఖమునుండి తప్పించుకొనజాలము గదా! రాజాధిరాజులైననూ, అశ్వనీదేవతలతో తుల్యులని ప్రపంచమున పేరొందిన మహాఘన వైద్యుల సహాయము గలవారైననూ, మృత్యుదేవతనుండి తప్పించుకొనజాలరు గదా! ప్రతిమానవుడును, ఆజ న్మయం దనుభవించుట కేర్పరచబడినప్రారబ్ధ మనుకర్మానుభవము ముగిసినతోడనే యొక్కనిముషమైననూ నీభూలోకమున నివసింపజాలడు. మరణ మెల్లరకునూ నిశ్చయమును, ననివార్యమునూ నయి యున్ననూ, అజ్ఞానాంధకారము మనల నావరించి, మరణము జ్ఞప్తికివచ్చినంతమాత్రముననే భయముచే మనము కంపము నొందుదుము. తనకుగాని, తనబంధుమిత్రులలో నెవరికైనగాని, మృత్యు వాసన్నమగుచున్నదని బోడకట్టినచో గలుగుదుఃఖమునకు మితియనునదే యుండదు. బంధుమిత్రులలో నెవరైననూ మరణించినపుడు, ప్రతిమనుజుడును దుఃఖసముద్రమున మునిగి, భూమ్యాకాశముల గానక పడెడు పరితాప మందరకునూ ననుభవములోనివిషయమే. ప్రపంచ

మున గలుగుదుఃఖము లన్నింటిలోను, మరణమువలనగలుగు దుఃఖమును మించినది మరియొకటి లేదు. ఈదుఃఖమువలన ననేకానర్థములు గలవు. ఇవి మున్ముందు వివరించెదను. ఇట్టి విచారసాగరమున మునింగియున్న వారికి దుఃఖోపశమనము గావించి మనశ్శాంతిని గల్గించుసాధనము లేనైనా కలవా యనునది మనము ప్రథమమున యోచించవలసియున్నది. ఈదుఃఖ మజ్ఞానమువలననే గలుగుచున్నది. ఇట్టియజ్ఞానాంధ కారమును బాపునట్టి తత్త్వజ్ఞాన మీకాలమున వేయింట నొక్కరికైనను లేదని చెప్పవచ్చును. కాని, పామరజనులకు సహితము దుఃఖోపశాంతిని గలిగించు నుపాయములు లేకపో లేదు అవి యేవనిన:—మరణమువలన బంధువియోగము కలిగినపుడు పొరలిపొరలివచ్చు దుఃఖమునకు కారణము లేవో బాగుగా విమర్శించిచూచి, అట్టి కారణములు సహేతుకములు కావని నమ్మకముగలుగునట్లు ఋజువుచేసినయెడల ఆదుఃఖము తొలగిపోవుటకు సందేహము లేదు. ఈదుఃఖమునకు రెండు ముఖ్యకారణములు గోచరించుచున్నవి. అవెవ్వియన:—

1. ప్రాణప్రదమైనబాంధవుడు మృతినొందినపుడు, ఆ వియోగమువలన చిరకాలమైత్రి నశించెననియు, ప్రాణముకంటెను ప్రియమైనమిత్రమును గోలుపోతిననియు నీవు విచారింతువు. ఇదియే నీవిచారమునకు ముఖ్యకారణము. కాని దూరదృష్టితో యోజించిచూచినచో నిది కేవలము భ్రమగాని నిశ్చయము కాదు. ఓదుఃఖపీడితుడా! నీమిత్రము నిన్ను విడ

నాడి పోలేదు. నీయొద్దనేయుండును. మరియు, మరణమువలన మీయన్యోన్యమైత్రి యించుకంతయునూ నశించ లేదు. ఈ విషయములు ముందుప్రకరణమున నీహృదయమునకునచ్చు నట్లు ఋజువుచేయగలను దుఃఖమును దిగమ్రింగుము.

2 దుఃఖమునకు రెండవకారణమేమనగా; మరణానంతరదశలనుగురించి నీకు బాగుగాదెలియకపోవుటచే, మృతినొందిననీమిత్రుఁ డేమయిపోయెనో గదా! యమదూత లేమి బాధించుచుందురో గదా! యనుతలంపులు దుఃఖోద్రేకమును గలిగించును కాని యిదియును విచారించవలసినయంశము కాదు. నీమిత్రుఁడు క్షేమముగానుండును. యమకింకరుల బాధలనునది మిథ్య. మరణానంతరమున జీవాత్మ యేలోకములలోనుండునదియు, నేస్థితులననుభవించునదియునూ, యిప్పుడు ప్రపంచమున పూర్ణముగా విమర్శింపబడినట్టియు, బడుచున్నట్టియు విషయములై యున్నవి. ఉత్తరలోకమున నీమిత్రుఁడు భూలోకమునకంటె నెక్కువసౌఖ్యము ననుభవించుచుండును. ఆలోకమునన్న నీమిత్రుని చూచి వానితో, లేక ఆమెతో ప్రసంగించివచ్చు సామర్థ్యముగలవారనేకు లిప్పుడుకలరు నీవునూ తగినకృషిచేసినచో నట్టిసామర్థ్యమును పొందగలవు. ఇవియన్నియు సవిస్తరముగా ముందుప్రకరణమున వివరింపబడును. దుఃఖించవలసినపని యెంతమాత్రమునూ లేదు.

రెండవ ప్రకరణము.

మరణమువలన వియోగము లేదు.

శ్లో॥ అశోచ్యా నన్వశోచ స్త్వం
ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూ నగతాసూంశ్చ
నానుశోచంతి పండితాః॥ భగవద్గీత_అ 2_11.

"నీవు దుఃఖింపదగనివారినిగూర్చి దుఃఖించినావు వివేకులు పలుకువట్టిమాటలను పలుకుచున్నావు. మృతిబొందినవారినిగూర్చియు, జీవించియున్నవారినిగూర్చియు వివేకముగలవారు దుఃఖింపరు."

మరరణమువలన నీమిత్రుని నీవుగోలుపోలేదనునంశముగూర్చి ముందువిచారింతము. ఇది సామాన్యజనులకు బాగుగాబోధపడుటకై "మనుష్యుడు" అనగా నేమియనువిషయము కొద్దిగా విమర్శింపవలసియున్నది. "నాకు ఆత్మకలదు" అని సర్వసామాన్యముగా చెప్పువాక్యము బాగుగాయోచించినచో సరికాదని విశదమగును. "నేను యాత్మను. నాకు శరీరముకలదు" అనిచెప్పినచో యెక్కువసరిగా నుండును. "మనుష్యుడు" అనగా నిశ్చయార్థము యాత్మ. ఆయాత్మయొకశరీరమును ధరించెను. ఈశరీరము "మనుష్యుడు" కాదు; ఈశరీరము అసలు "మనుష్యుడు," అనగా 'యాత్మ' ధరించిన వస్త్రమునుబోలియుండుపైతొడుగయి యున్నది. మనము

"మరణము" అనివ్యవహరించునది, మనుష్యునకు పైనున్నయీ దుస్తు. లేక "కోటు"ను విడనాడుటయే గాని అసలు "మనుష్యు" నకు చావు లేదు. నీవు బజారునకు వెళ్ళి యింటికివచ్చి పైనధరించినకోటును తీసివేయుటవలన నీకు యేమియూ భంగమెట్లు కలుగ లేదో, నీమిత్రునకుకూడా మరణమువలన నేమియూ భంగముకలుగలేదు. కనుక నీవునీస్నేహితునిః ష్టపోలేదు. నీ స్నేహితుడు యిదివరలోధరించియుండు "దుస్తు" మాత్రము నీకనులకు గోచరముగుటలేదు. నీమిత్రుము ధరించుచుండునట్టి పై దుస్తు నశించినది గాని, యాదుస్తునుధరించినవాని కేమియూనష్టముకలుగ లేదు.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ ।
నవాని గృహ్ణాతి నరో పరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా ।
న్యన్యాని సంయాతి నవాని దేహీ॥ భగవద్గీత-2-22.

"మనుష్యుడు శిథిలమయినవస్త్రములను విడచి యేలాగున క్రొత్తవస్త్రములను స్వీకరించుచున్నాడో, అలాగుననే యాత్మ శిథిలమయినదేహములనువిడిచి క్రొత్తశరీరములను పొందుచున్నాడు"

నీవుధరించినకోటు కాలానుక్రమమున చిరిగిపోయినపుడుగాని, అనుపయోగమైనపుడుగాని నీవెట్లువిచారించవో, దేహియగుఆత్మ ధరించినకోటువంటియీశరీరము కాలానుక్రమమున సిథిలమగునపుడు నీవు విచారించవలసినపని యేమి

న్నది? నీవు ప్రేమించినపదార్థము నిశ్చయముగా యోచించి చూచిన శరీరాంతర్గతమగు చైతన్యముగాని, అచేతనమగు స్థూలశరీరము కాదు. నిశ్చయముగా నీవు ప్రేమించినది నీమి త్రునిశరీరమే యయినయెడల, మరణము సంభవించినతర్వాత గూడ, నామృతకళేబరమును దాచివకములలోనుంచియో యెట్లో శాశ్వతముగా నీయొద్దనుంచుకొనవచ్చునుగదా. కాని యట్లుచేయుటకు నీవిచ్ఛయింపవు సరేగదా, జీవుడువిడచి వెళ్ళి పోయినతర్వాత ఆశరీరమును నీవుచూచుటకైనన్నూ భయ పడుదువే!

శ్లో॥ యావ త్పవనో నివసతి దేహే ।
తావత్ పృచ్ఛతి కుశలం గేహే ।
గతవతి వాయౌ దేహాపాయే ।
భార్యా బిభ్యతి తస్మిన్ కాయే॥

యనునట్లు, జీవుడువదలి వెళ్ళినశరీరమునుజూచి, యత్యంత ప్రియురాలగుభార్యకూడా భయపడును. కనుక దీనినిబట్టి యేమి తేలుచున్నదనగా, నీవు ప్రేమించినవస్తువు జడపదార్థ మగుశరీరముకాదనియు, యాశరీరమునుధరించి, నడపించు చుండినజీవాత్మయనియు స్థిరమగుచున్నది. జీవాత్మకు చావు లేదుగదా. కనుక నీవువిచారించవలసినపనియేమున్నది? శరీ మునకునూ జీవునకునుగలదాదాప్యముచే రెంటికినీ భేదము గానలేక, శరీరమేజీవుడనుకొనునజ్ఞానమున బడి, శరీరము మృతి నొందినపుడు విచారించుచుందుము.

శరీరముమృతినొందినను నీమిత్రుఁడుజీవించియున్నాఁడని చెప్పుటచే నాతఁడు ఆకారములేనివాయువువలె నున్నాఁడని తలంపకూడదు. ఆత్మకు స్థూలశరీరము, సూక్ష్మశరీరము అని రెండుదేహములు కలవు. ఇవిరెండును నొకదానిలో నొకటి యిమిడియున్నవి. ఎట్లంటేని, మనము పైనతొడుగుకొనుకోటును స్థూలశరీరముతో పోల్చినయెడల, దానిలోపల తొడుగుకొనుఅంగీని సూక్ష్మశరీరముతో పోల్చవచ్చును. స్థూలశరీరముపోయినవెనుక యాత్మ యీసూక్ష్మశరీరమును ధరించియుండును. ఈసూక్ష్మశరీరము అన్నివిధముల స్థూలశరీరమును పోలియుండునుగాని స్థూలనేత్రములకగోచరముగా నుండును. ఈవిషయము బోధపడుటకు కొంచెము విస్తరించి వ్రాయవలసియున్నది.

ప్రపంచమున దృగ్గోచరమగుపదార్థము లన్నియు, ఘనపదార్థములు, ద్రవపదార్థములు, వాయుపదార్థములు, అనిమూఁడు తెరగులుగా నున్నవి. మొదటిరెండుతెరగతుల పదార్థములును నేత్రములకు గోచరములగును. వాయుపదార్థములు నేత్రగోచరములు కాకపోయినను, త్వగింద్రియముచే తెలిసికొనదగియున్నవి. మొత్తముమీఁద నీమూఁడుతెరగతుల పదార్థములను జ్ఞానేంద్రియములచేత మనము తెలిసికొనుచున్నాము. వాయువుకంటెను బహుసూక్ష్మమగుపదార్థములు ఇంకాచాలాకలవని బాగుగావిమర్శించినపెద్దలు చెప్పుచున్నారు. ఇవి పంచేంద్రియములచేతను తెలుసుకొనదగినవి కావు.

పంచభూతాత్మకమయినస్థూలపదార్థములుమాత్రమే పంచేంద్రియములకు గోచరించును గాని పైనచెప్పబడిన, వాయువుకంటె సూక్ష్మతరములగుపదార్థములు సూక్ష్మేంద్రియములకు గోచరములగును. స్థూలశరీరమునందు పంచేంద్రియములు యెట్లుకలవో అట్లే సూక్ష్మశరీరమునందును సూక్ష్మేంద్రియములు కలవు. సూక్ష్మశరీరము సూక్ష్మపదార్థములచే చేయబడియుండుటచే నది సూక్ష్మేంద్రియములకు గోచరమగునుగాని స్థూలేంద్రియములకు నగుపడదు. కావుననే, మనము సూక్ష్మశరీరములను బాహ్యేంద్రియములతో చూడజాలము. సూక్ష్మేంద్రియముల నుపయోగించుసామర్థ్యము యోగులు మొదలగుకొందరుమహానుభావులకుమాత్రమే యుండును. అట్టిశక్తిగలవారు, సూక్ష్మశరీరధారులగు మృతిబొందిన మనమిత్రులను చూడగలరు.

మనము ముఖ్యముగా మనస్సునకెక్కించుకోవలసిన విషయ మేమనగా, మరణము జీవమునకు అంత్యముకలుగజేయునది కాదనియు, జీవాత్మ నొకస్థితినుండి యింకొకస్థితికి తీసికొనివెళ్ళెడుద్వారమువంటి దనియు, తెలుసుకొనవలెను. జీవాత్మ యీస్థూలప్రపంచమగుభూలోకమున ప్రవర్తించునపుడుపయోగించుపనిముట్టువంటిది స్థూలశరీరము; ఈయాత్మ భువర్లోకమున ప్రవర్తించునప్పుడుపయోగించుపనిముట్టు, లేక ధరించువస్త్రమువంటిది సూక్ష్మశరీరము. మొదటిస్థితినుండి రెండవస్థితికి జీవాత్మపోవునపుడు మరణమనెడుగుమ్మము వెంట

బోవును. కొందరుపాశ్చాత్యులు జీవాత్మ పుట్టుకతోడనే యె క్కడనుండియో హటాత్తుగాయుద్భవిల్లెననియు, మరల మర ణముసంభవించినపుడు అంతయాకస్మికముగానే యెక్కడికో యంతర్థానమగుననియు తలంచెదరు. కాని యిప్పుడు యిం గ్లాండు, అమెరికా, ఫ్రాన్సు, మొదలగు దేశములలోసహితము శాస్త్రజ్ఞులని (Scientists) యెక్కువఘనతవహించినవారు కూడా అనేకసంవత్సరములు పాటుపడి, పరిశోధనలుచేసి, మరణానంతరమునగూడ "మనుష్యుడు" జీవించియుండునని స్థిరపరిచిరి. ఈవిషయము ముందుప్రకరణములలో చర్చించె దను. మనుష్యు డిదివరలో ననేకజన్మల నెత్తియున్నాడు. ఇకముం దనేకజన్మల నెత్తనైయున్నాడు. ఈప్రస్తుతపుజన్మను గురించి మనమురోదించిననూ, జీవాత్మ యీభూలోకమున గడపుకాలము, మరణానంతరమున ఊర్ధ్వలోకములో గడపు కాలముకంటె పెక్కుమడుంగులు తక్కువయనియు, సర్వసా మాన్యముగా భూలోకమున గడపుకాలము ఊర్ధ్వలోకము లోజరగుకాలములో 1/30 వంతుండుననియు తత్వజ్ఞానసమా జమువారు (The Theosophical society) పరిశోధనలవలన స్థిరపరిచిరి. కనుక, జీవునియొక్కప్రయాణములో భూలోక ప్రవాసము బహుస్వల్పమగుటచే, జీవు డూర్ధ్వలోకగతుడగు నపుడు తన అసలునివాసమునకు పోయినాడని సంతసించ వలెను. గాని, విచారించుటకు కారణములు లేవు. ఒక ప్రయాణికుడు తనమార్గమునబోవుచు మధ్యమార్గములో

నొకసత్రమునవిడిది చేసెను. ఆసత్రమున విడిసియున్నయితర బాటసారులతో నారోజునకలసిమెలసి ముచ్చటించుచూ సుఖముగానుండి, మరునా డాస్నేహితులనువిడచి తనదారినితాను ముందుకుప్రయాణమై పోయెను. ఈభూలోకములో జీవాత్మయొక్క వాసము, సత్రములో బాటసారిగడపినయొక్క రోజువంటిదని నమ్ముము. ఈలోకములోని మనబంధుమిత్రులు బాటసారితో సత్రములో కలసినతాత్కాలిక స్నేహితులవంటివారు. బాటసారి మరునాడు తనమార్గమున ముందుకు బోయినపుడు, వెనుకవిడువబడిన స్నేహితులు విచారించినచో నెంత సందర్భముగానుండునో, జీవుడు తనప్రయాణములో నూర్ధ్వలోకములనుండి యీమధ్యలోకమునకువచ్చి, స్వల్పకాలముండి, తనలోకమునకుతానుబోవునపుడు బంధుమిత్రులు దుఃఖించినచో నంతసబబుగానేయుండును.

మనము గమనించవలసిన యింకొకయంశమేమనగా, చనిపోయినవారు మనలనువిడిచి బహుదూరముననున్న యేవో లోకములకు పోయిరనితలంచుట. ఆమాట అసత్యము. మన మతమునందును, ఇతరమతములందునుగూడ పామరజనులలోనిట్టి వెర్రినమ్మకములుగలవు. మరణముసంభవించినతోడనే జీవుడు నక్షత్రమండలములనడుమనున్న స్వర్గలోకమునకు దేవదూతలచేతనో లేక నరకలోకమునకు యమదూతలచేతనో కొనిపోబడునని కొందరుతలంతురు. ఇది కేవలము తప్పుఅభిప్రాయము. స్వర్గనరకములు వేరేయెక్కడనో దూర

మున లేవు. మరణము సంభవించినతోడనే జీవాత్మ నివసించు లోకము దూరముగా నెక్కడనో లేదు. ఆలోకమునూ యిక్కడనే, అనగా యీలోకములో నంతర్భూతముగానే యున్నది. వెనుక చెప్పబడినయుపమానము నింకొకసారి చర్చింతము. నీవు నీపైకోటును తీసివేయునపుడు, స్థలముమారక యదేస్థలమునందున్నట్లు, స్థూలశరీరమనెడుకోటును విసర్జించినజీవాత్మయు నదేస్థలమునందు సూక్ష్మశరీరధారియై యుండును. సూక్ష్మశరీరము మనస్థూలనేత్రములకగోచరముగనుక, మరణించినమనమిత్రులు మనసమీపముననే యున్ననూ వారిని మనము చూడజాలకున్నాము.

మరణముకలిగినపుడు మనము స్థూలశరీరములను విసర్జించి సూక్ష్మశరీరములతోనుండుమనుటయే పైనచెప్పినదానికంతకునూ సారాంశమై యున్నది. మనము స్థూలశరీరములను విసర్జించుట యొక్కమరణావస్థయందే కాదు. ప్రతిరోజునూ రాత్రిమనమునిద్రించునపుడు తాత్కాలికముగా మనస్థూలశరీరములను వదలి సూక్ష్మశరీరములతో ప్రపంచమంతటను విహరించుచుందుము. ఇయ్యది, సూక్ష్మదృష్టి లేక దివ్యదృష్టి (Astral vision) కలవారలచే ప్రత్యక్షముగా పరిశీలింపబడి స్థిరపరచబడినవిషయముకాని, యబద్ధముకాదు. మనమట్లు సూక్ష్మదేహములతో విహరించునపుడు, స్థూలనేత్రములతో చూచువారికి కనబడముకాని, మనవలెనే సూక్ష్మదేహముల ధరించియున్నవారి కగపడుదుము, తిరిగి మనముమేలుకొను

నపుడు మనసూక్ష్మదేహము యథాప్రకారముగా స్థూలదేహమున ప్రవేశించును. కావున, సుషుప్త్యవస్థ ప్రతిదినమును సంభవించు తాత్కాలిక మరణావస్థ యని చెప్పవచ్చును. కాని యీ రెంటికిని ఇంచుక భేదము మాత్రము కలదు. అదియేమనగా, సుషుప్త్యవస్థయందు సూక్ష్మశరీరమునకు స్థూలశరీరముతో గలబంధము తెగియుండక పోవుటచే, సూక్ష్మదేహము తిరిగి స్థూలదేహములోనికి రాగలిగియుండును. మరణావస్థయం దీ రెండుశరీరములకూ గలబంధము పూర్తిగా తెగిపోవును గాన తిరిగి సూక్ష్మదేహము స్థూలము నాశ్రయింపజాలదు. కాబట్టి దీనినిబట్టి యేమి తేలుచున్న దనగా, ప్రతిదినమునూ మనము నిద్రించునపుడు, చనిపోయిన మనమిత్రులే దశలోనికి పోయిరో యాస్థితిలోనికే పోవుచున్నాము. మనము నిద్రించునప్పుడు, స్థూలశరీరమును విసర్జించి సూక్ష్మశరీరముతో విహరించునపుడు, మృతినొందిన మనమిత్రులను కలుసుకొని, వారితో కలసిమెలసి యాలోకమునందు పరిపూర్ణవ్యక్తతతో నుందుము. కనుక, సుషుప్త్యవస్థయందు మనకునూ వారికిని సంయోగము గలుగుచుండుటచే, ఈవియోగదుఃఖము జాగ్రదవస్థయందే యనిపించవలెను. ప్రతిరాత్రియును నీమిత్రములను నీవు కలుసుకొనుచుండగా నీవు దుఃఖించవలసిన పనియేమున్నది?

నిద్రావస్థయందు మనము పితృలోకమున నున్న మనమిత్రులను కలుసుకొనుచున్నచో, నాసంగతు లేమియూ జాగ్రదవస్థయందు జ్ఞాపకములోనికి రావేమని శంక కలుగవచ్చు

ను. జాగ్రదవస్థలోనున్నపుడు మనకు ప్రపంచవిషయిక జ్ఞానము కలుగజేయుయింద్రియము మెదడయి యున్నది. ఇది జీవుడు స్థూలదేహమునందు వ్యక్తిగలిగియున్నప్పుడే పనిచేయుచుండును. మనము నిద్రించునపుడు సూక్ష్మదేహములో జరుపు ప్రవర్తనయంతయు స్థూలదేహపు మెదడునకు సోకదు. ఎందుచేతననగా నప్పుడు మెదడు పనిచేయుచుండుటలేదు. సూక్ష్మదేహముతో మనము జరిపినచర్యను, స్థూలదేహపువ్యక్తిలోనికి తెచ్చుకొనుసామర్థ్యము సర్వసామాన్యముగా మానవులకు లేదు. రెండుశరీరములలోనూ యేకవ్యక్తియే (Continued consciousness) యున్నయెడల మరణమనునదియే యుండదు. కొందరు మహానుభావులకీయేకవ్యక్తి కలదట. మరికొందరకీశక్తి లేకపోయిననూ, సూక్ష్మదేహములో జరిగినపనులు, జాగ్రదవస్థకు వచ్చినతోడనే చాలాతారుమారయిననూ, స్ఫుటమైనస్వప్నమువలె గోచరించును.

మనము జాగ్రదవస్థనుండి సుషుప్తికిపోవునపుడుమాత్రము, స్థూలదేహముతో జరపినపనులన్నియు సూక్ష్మదేహములో జ్ఞప్తికివచ్చును. ఏలయనగా అప్పుడు మనము భారమగుస్థూలదేహమును విసర్జించుచున్నాము; మరియు నావ్యవహారములన్నియు స్థూలసూక్ష్మదేహములు రెంటితోడనూ సంబంధముగలమనసులో నుండును. కావున మనమేమైననూ ఒకవిషయమును మృతినొందినమనమిత్రులకు తెలియపరచవలెననిగాని, వారితోడనేవిషయమునుగురించియయిన-

వనూ సలహా చేయవలెననిగాని కోరినయెడల, పరుండబోవు నవు డావిషయమును బాగుగా స్మరించి, మనస్సునకెక్కించు కొని "యీవిషయము తప్పక నామిత్రునితో జెప్పదను" అని దృఢనిశ్చయముచేసుకొని నిద్రించినయెడల తప్పక ఆవిష యము వారికి తెలియపరచగలమని నమ్మవలెను. వారుచెప్పిన జవాబుమాత్రము స్థూలదేహపువ్యక్తిలోనికి తెచ్చుకోనజా లము. కాని మనమీతీరున ప్రపంచవిషయములనుగూర్చి పితృలోకమునందున్నమిత్రులను బాధించి, వారిమనసును క్రిందిలోకమున కాకర్షింపగూడదు.

మూడవ ప్రకరణము.

మరణసమయమున గలుగుమార్పులు.

శ్లో॥ శరీరం యదవాప్నోతి ।
యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి ।
వాయుర్గన్ధా నివాశయాత్ ॥

భగవద్గీత_15 అధ్యాయం_8.

"జీవుడు ఎప్పుడైతే శరీరమునుండి బయలుదేరుచున్నాడో; ఎప్పుడు రెండవశరీరమును బొందుచున్నాడో అప్పుడు, పుష్పము మొదలగువానినుండి వాయువు వాసనగలనూ

త్స్థాంశములను స్వీకరించిపోవునట్లే వీటిని (సూక్ష్మశరీరమును) స్వీకరించిపోవుచున్నాడు."

జీవుడు, ప్రాణావసానమున శరీరము మొదలగుస్థూల తత్వములను విడనాడి, యుత్కృష్టమగుగతులకు బోవును. మొట్టమొదట స్థూలశరీరమును విసర్జించును. పంచభూతాత్మకమగుస్థూలశరీరమనసేమో యిచట కొంచెము వ్రాయవలసియున్నది. స్థూలశరీరము కోటానకోట్లుసూక్ష్మ (చిన్న) జీవుల కలయికవలన నేర్పడినది. ఆంగ్లేయభాషలో (cells) అను శబ్దమునకు "సూక్ష్మజీవులు" అని వాడుదము. కోట్లకొలదిగానున్నయీసూక్ష్మజీవుల కొక్కొక్కదానికి కొంచెము ప్రాణతత్వమును, కొంచెమువుస్తత్వమును ఉండి, మనుష్యుని యొక్కయనలుమనస్తత్వమునకు స్వాధీనవర్తులై యైకమత్యముగలవిగానుండును. ఈసూక్ష్మజీవులన్నియును జేరి స్థూలశరీరమగుచున్నది.

మృత్యు వాసన్నమయినపుడు, అనగా జీవుడాజన్మలో నుపయోగించినస్థూలదేహమును విసర్జించునపుడు. శరీరములోనున్న సూక్ష్మజీవులన్నియు వాటియైకమత్యమును విడనాడి భిన్నములై పోవును. ఈసూక్ష్మజీవులనన్నిటినీ కలపి యేకముగానుంచిన ప్రాణశక్తి పోయినందున, నివి భిన్నభిన్నమార్గముల బోవుటకు యత్నించును. ఈక్రియనే మనము 'శరీరము కుళ్ళిపోవుట' యనివాడుదుము. కొన్నిసూక్ష్మజీవులు సమీపముననున్న వృక్షములలో లేక మొక్కలలోజేరి, తర్వాత నా

మొక్కలను భక్షించిన జంతువులలో లేక మనుష్యుల శరీరములలో జేరును. మరికొన్ని భూమిలోనుండి, తుదకు మరియేజీవ జంతువైనను వాటి నాహారముగా తీసికొనువరకు నట్లనే యుండును. ఈ మార్పులన్నియు భూమిపై వదలివేయబడిన, లేక భూమిలో పూడ్చబడిన, కళేబరముల విషయమై వివరింపబడిన వని యెఱుఁగవలెను. ఇందువలన నేమి తెలియుచున్న దనగా; మరణమువలన స్థూలశరీరమునకు సహితము నిశ్చయముగా నాశనము లేదనియు, నది భిన్నపదార్థములలోకి మారినను, దాని భాగములవలన నితరశరీరము లేర్పడుచున్న వనియు విశదమగుచున్నది.

'మరణమున నర్థ మేమి' యను విషయమై వ్రాయుచు, గొప్ప ప్రకృతిశాస్త్రవేత్త యగు, సర్ ఆలివర్ లాడ్జి (Sir Oliver Lodge) యను నాయన యిట్లు వ్రాసెను. "మరణము వలన దేనికిని నాశనము లేదు. మరణమను కార్యమువలన సంభవించున దేమనగా, ఆత్మయును దేహమును వేరుపడును. దీని వలన యాత్మకు నష్టము లేక పోవుటయే గాక యెక్కువ స్వేచ్ఛ సంభవించినది. శరీరము కుళ్ళిపోవును గాని దానికినీ నాశనము కలుగ లేదు మార్పు మాత్రము కలిగినది."

జీవుడు శరీరమును విడిచిన క్షణమునందియు, సూక్ష్మజీవుల నొకటిగా జేర్చియుంచిన మనస్సు, వాటిపై నధికారము మానినందున, నవియన్నియు సేనాధిపతి చనిపోయిన సైన్యము వలె మహాకల్లోలమునకులోనై, యొకదానినొకటి తోసుకొ

నుచు, గెంటుకొనుచు, పోరాడుచు, యీకల్లోలమునుండి దేనిదారినది యవతలబడిపోవలెనని ప్రయత్నించును. శరీరము జీవించియున్నకాలములో తమయధికారియాజ్ఞకు లోబడి, ఐకమత్యముతో పనిచేయుచు, శరీరమును మంచిస్థితిలోనుంచుట యనెడు యేకోద్దేశముతో ప్రవర్తించుసూక్ష్మజీవులు యధికారిపోయినతోడనే తమదారినితాముపోవలెనని యిట్టి కల్లోలమును గలుగజేయును. ఆహా! మనస్థూలనేత్రముల కగపడకపోయినను, మృతకళేబరములోనహిత మెన్నిచిత్రములు జరుగుచున్నవో! శరీరము మరణమునొందినను దానిస్వల్పయంతర్భాగములను వీక్షింపగలిగితిమేని, ముందటికంటె నెక్కువజీవస్థితి కాననగును.

జీవాత్మ శరీరమునువిడిచిపోయినవెనుక, సూక్ష్మజీవులకు కావలసినస్వల్పప్రాణతత్వముమాత్రము వాటిలోనిలచియుండి, మిగిలినప్రాణతత్వమంతయు ప్రపంచములోనిసమూహప్రాణతత్వాగారమున పోయిచేరును. [Universal storehouse of Prana] పంచభూతములునూ విడిపోయి, వేటియగారమున నవిచేరును.

మరణకాలమునందు జీవుడు శరీరమునుత్యజించునపుడు తనవెంట లింగశరీరమనబడుసూక్ష్మశరీరమును, సూక్ష్మతత్వములను గొనిపోవును. సూక్ష్మశరీ మనగా, స్థూలశరీరమును సరిగాపోలియుండునకలువంటిదనియు, మననేత్రముల కగోచరమగుబహుసూక్ష్మపదార్థముతో చేయబడినదనియు యిది

వరలో చెప్పియుంటిమి. ఇది దివ్యదృష్టి లేక సూక్ష్మదృష్టి కల వారికి (Clairvoyants) గోచరమగును. ఇట్టిదృష్టిగలవారు ప్రాణావసానదశలోనున్న మనుష్యుని చూచినయెడల, స్థూల దేహమునుండి సూక్ష్మదేహము విడిచిపోవుక్రియయంతయూ బహుచిత్రముగా వారికికనబడును.

మనహిందూయోగశాస్త్రసంబంధమగుబహుగూఢమయిన తాటియాకుగ్రంథములనుండి నవీనముగా వ్రాయబడిన యొక యాంగ్లేయగ్రంథమున, మరణము సంభవించునపుడు జరుగుక్రియయంతయూ బహుచిత్రముగా నిట్లు వ్రాయబడినది:—

ప్రాణావసానసమయమునందనేకులకు దివ్యదృష్టిప్రాప్తించును. ప్రపంచసంబంధమగువిషయముల స్ఫుటత్వము మనస్సునుండి తగ్గి, జీవాత్మ ప్రవేశింపబోవుచున్న భువర్లోకముయొక్కయు, ఆలోకవాసులయొక్కయు సౌందర్యవైభవములు క్రమక్రమముగా గోచరమగుట కారంభించును. మృతినొందుచున్న వానియొక్కబంధుమిత్రులు అనగా నిదివరలో మృతినొంది భువర్లోకములో సూక్ష్మశరీరములతో నున్న వారందరునూ, మరణపుమంచముచుట్టూబిలబిలలాడుచూ తేజోమయశరీరములతో గుమిగూడుట కానవచ్చుచుండును. ఇది, మరణావస్థయందు సూక్ష్మదృష్టిప్రాప్తించినవానికే గాక, మరణపుగదిలో నున్న వారిలో నెవరికైనా సూక్ష్మదృష్టియున్న యెడల వారికినీ గనబడుచుండును.

సూక్ష్మదృష్టికలవారి కామరణపుగది బహుశోభాకరముగా గనబడును. మరణించుచున్న వానిభువర్లోక బాంధవులు, తమలోకములోనికి వానిరాక నెదురుచూచుచూ, వానిని గొనిపోవుటకు మంచముచుట్టూ మూగి యుందురు. ఈలోకమున మరణమనగా, భువర్లోకమునపుట్టుట యనియర్థము. ఈలోకమున జననముకలుగునపుడు పురిటిగది చుందును చుట్టుపక్కలను, శిశువుయొక్కజననమునకై బంధువులెట్లునిరీక్షించియుందురో యట్లే, జీవుడు భూలోకమునుండి భువర్లోకమున జనియించునపుడు భువర్లోకబాంధవులు నిరీక్షించియుందురు. భువర్లోకవాస్తవ్యులు తేజోమయశరీరులగుటచే మరణగృహము దేదీప్యమానముగ కాంతులతో నిండి, దివ్యదృష్టికలవారి కెంతోశోభాకరముగా గాన్పించుచుండును. వారికి దివ్యశ్రోత్రేంద్రియముకూడా నున్నయెడల (clairaudience) నాగటలో బహుశ్రావ్యముగా భువర్లోకనాదములుకూడా వినవచ్చుచుండును. ఇంకనూ యెక్కువసిద్ధులుగలయోగులకు అనిర్వాచ్యమగు సత్తములోకపరిమళముకూడా సోకుచుండును. మనకు మిక్కుటముగాదుఃఖకారకమగు మరణగృహము, సూక్ష్మదృష్టిమొదలగుశక్తులుగలవారి కెంతవైభవపూరితముగానగపడునోచూడుడు! జీవుడు స్థూలదేహవిసర్జనము చేయు నాపవిత్రకాలమునందు, మృతినొందుచున్నవారిలో ననేకులకు నీభువర్లోకవైభవమంతయూ గనబడుటయేగాక,

ముందుచనినబంధువులు తనకు స్వాగతమిచ్చుచూ నాప్యాయముగా ప్రతీక్షించియుండుటయూ గానవచ్చును.

సూక్ష్మదృష్టికలవారు బాగుగాపరిశీలించినచో వారి ప్రాణావసానసమయమున స్థూలశరీరమునుండి సూక్ష్మశరీరము బయలువెడలుట గానగును. ప్రప్రథమమున నీసూక్ష్మశరీరము ఆవిరివలెమాత్ర మగపడును; కాని క్రమక్రమముగ నిదిస్పష్టమై స్థూలశరీరాకృతిని గైకొనును. ఇప్పటికి రోగికి పూర్తిగా శరీరస్మృతితప్పియుండుటచే బాధయనగ నేమియూ ప్రయాణమైపోవుచున్నజీవునకు తెలియనే తెలియదు. ఈసందర్భమున, మరణకాలమందు జీవునకుబాధయుండునా లేదా యనువిషయము నించుక విమర్శింతము. జీవుడు శరీరమును విడచిపోవునపుడు మరణవేదనయను నధికమగుబాధను పొందునని సామాన్యముగా నందరియభిప్రాయమైయున్నది. కాని యిది కేవలము తప్పుఅభిప్రాయమైయున్నది. స్థూలశరీరమును విడుచుటయనెడుక్రియ జీవునకు బహుళాహ్లాదకరమైనది యనియు, నా యుత్క్రమణసమయమున నించుకంతయు బాధయుండదనియు ననేకగ్రంథములవలన తెలియుటయే గాక, మరణానంతరము భువర్లోకముననుండి వర్తమానములనంపుచున్నవారనేకులిట్లు ప్రత్యక్షముగా సాక్ష్యమిచ్చియున్నారు. రోగమువలనకలిగినబాధ స్థూలశరీరసంబంధమయినదగుటచే, శరీరమామీద స్మృతితప్పినది మొదలుకొని యీబాధ జీవునకేమియూ నంటదు. కాళ్ళు, చేతులు కొట్టుకొనుట, వంకర

పోవుట, మొదలగునవన్నియు జీవుడు వెడలుచున్నప్పుడు గాని, వెడలిపోయినవెంటనే గాని నరములు బిగియుటవలన కలుగును ఇవి జీవునిబాధలు కావు.

సూక్ష్మశరీరము దేహముపైకి వచ్చుచు స్ఫుటమగుచున్నకొలది, నీరెండుశరీరములను బంధించియుండు దారము, వన్నెవెండితీగలవలె సూక్ష్మదృష్టికి కానవగును. సూక్ష్మశరీరము పూర్తిగా నేర్పడినతర్వాత, దగ్గిరనున్న భువర్లోకవాసులీవెండిదారమును తెంపివేయుదురు. ఈదారము తెగిపోయినతోడనే మరణముకలిగినదని చెప్పుదుము. సుషుప్త్యవస్థలో సూక్ష్మశరీరము బయిటికివచ్చినప్పుడీవెండిదారము తెగదు. కావున, నిదురలేచునపుడు సూక్ష్మశరీరము తిరిగి స్థూలములో ప్రవేశించును; మరణమునందదితెంపివేయబడును గనుక తిరిగిప్రవేశింపజాలదు.

జీవుడు సూక్ష్మదేహధారియై బయలువెడలుచున్నపుడాతని కాజీవితకాలములో జరిగినచరిత్రయంతయూ ప్రాసగుచ్చినట్లు, పుట్టుక మొదలు చావువరకు జరగినదంతయు, నాతనియెదుట ప్రదర్శింపబడును. అనగా, నాతనిమనస్సునకు తనచర్యయంతయూ నాటకమాడిన ట్లొక్కపర్యాయము గోచరించును. ఇదివరలో మరపువచ్చినయనేకవిషయములు స్ఫురణకువచ్చి ప్రత్యక్షముగా కనుపడి, యవి యట్లుకలుగుటకు కారణములుసహితము గోచరించును. ఇట్లుసంభవించుటచే జీవుడీసమాచారమును ముందుపయోగపరచుకొను

టకు వీలుకలుగును. కావున మరణించువానిచుట్టునూ నిర్మలముగను, నిశ్శబ్దముగనూ నుండవలెనని తెలిసినవారు చెప్పుదురు. బంధువులరోదనములు, పైనచెప్పినప్రదర్శనమును జూచుచున్నజీవునకు కలతయు తొట్రుపాటును గలుగజేయుటయే గాక, నిర్మలముగను, హాయిగాను నుత్తమలోకమునకు ప్రయాణము చేయుచున్నజీవుని వెనుకకు నాకర్షించి బాధనుకలుగజేయును.

ఈలాగున ప్రయాణమై జీవు డెక్కడకు బోవుచున్నాడు ?

నాల్గవ ప్రకరణము.

భు వ ర్లో క ము.

శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం ।
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
... ...

భగవద్గీత-9 అ॥ 21.

"వారు (పుణ్యకర్తచేయువారు) విశాలమగుస్వర్గలోకము ననుభవించి, పుణ్యముతుగిసినతోడనే యీమనుష్యలోకమున ప్రవేశించుచున్నారు

వెనుకటియధ్యాయాంతమునందలి ప్రశ్న కిచ్చుటనుత్తరమును విమర్శింతము. ఒకజన్మముగిసినది మొదలు తిరిగి మరియొకజన్మ మెత్తువరకును మధ్యకాలమున జీవుని యొక్క స్థితిగతులు నిర్దిష్టప్రదేశములతో సంబంధించియుండునని తలంపకూడదు. అనగా మరణముకలిగిన వెంటనే జీవుడింకొక స్థలమునకుబోయినాడనియు, పాపములననుభవించుట కొక స్థలమునకుగొనిపోబడుననియు, నాకర్మముగిసిన వెనుక పుణ్యముల ననుభవించుట కింకొకస్థలమునకు గొనిపోబడుననియు, తలంచుట సరికాదు. పుణ్య, పాపలోకములన్నియు నిక్కడనే యున్నవిగాని వేరువేరుస్థలములయందు లేవు. ఈవిషయము మనస్సునకెక్కించుకొనుట కష్టముగాన జవాబుసూక్ష్మబుద్ధితో నీయంశముల చదువరులు గ్రహింపవలెను. జీవుడు తనకర్మానుసారముగా వేరువేరు "స్థితుల" ననుభవించునుగాని, వేరువేరు "స్థలముల" కు బోడు. ఒక్కొక్క "స్థితి" ననుభవించునపుడు ఒక్కొక్కలోకములోనున్నట్లు మనము సామాన్యముగా వాడుచుందుము. ఈలోకము లనునవి యన్నియు నొకదానిలోనొకటి యంతర్భూతమై యొక్కప్రదేశమునందే యున్నవి. దీనికొక చిన్నయుదాహరణమును తీసికొందము.

ఒకయింటికప్పులోని రంధ్రముగుండా సూర్యకాంతి లోపలకు వచ్చుచున్నదనుకొనుము. ఆసూర్యకిరణముయొక్క మార్గముననే మనము విద్యుచ్ఛక్తిని [Electric current] గూడా పంపుదము. ఈసూర్యకిరణమార్గమున, నొకచే "స్థల

మందు" మూడు వేరువేరుశక్తులు గలవు. సూర్యునినుండి వచ్చు ఉష్ణము (Heat) అనబడుశక్తియొకటిన్నీ కాంతి (Light) యనబడునింకొకశక్తిన్నీ, విద్యుచ్ఛక్తి (Electricity) యనబడు నింకొకశక్తియు గలవు. ఇవియన్నియు నొక "ప్రదేశ"మందే యొకదానితో నొకటి సంబంధించకుండా లేవా? ఈలాగుననే సూక్ష్మలోకములనబడునవియు నొకదానిలో నొకటి యంతర్వ్యాప్తమై యిక్కడనే యున్నవి. ఈవిషయమును వర్ణించుచు గుప్తవిద్య (Occultism) నెరిగిన మహానుభావుడొకడిట్లు చిత్రముగా వ్రాసెను

"మనమాకాశమువైపునకు జూచునపుడు మనకును నక్షత్రములకును నడుమ నేమియును గనుపడదు. ఇది యుత్తఖాళీస్థలమని మనముతలంతుము కాని, మనమొక పర్వతశిఖరమునుండి క్రిందికిజూచునపుడు కనులకుగోచరించుచిత్రవిచిత్రమగుప్రదర్శనమునకంటె నెన్నోరెట్లెక్కువసొగసుగలలోకజాలములగుండా మనదృష్టిపోవుచున్నది. అవియేమియు మనస్థూలనేత్రములకగపడనందున ఖాళీస్థలమని తలంచుచున్నాముగాని, యీప్రదేశమున కోటానకోట్లు నరకలోకజీవులు నివాసముచేయుచున్నారు. అందులోననేకులు మనలనుబ్రేమించి ముందు చనినవారై యున్నారు. వారలను సకాలములో మనమును కలియుదుము. ఇది బూటకపుమాట కాదు. ప్రత్యక్షముగా కనుపెట్టబడినవిషయము."

జీవుడు శరీరమునువిడచి వైకిపోయినతోడనే సౌఖ్య దాయకమును, నిర్మలమును నానందజనకమును, విశ్రాంతికర మునునగు చక్కనినిదురవంటిస్థితిలో ప్రవేశించును. భూలోకమునవిడువబడినబంధువర్గముయొక్కరోదనములును, యార్తధ్వనులును నత్యధికముగానుండెనేని ఈచక్కనినిదురకు భంగముకలిగించి జీవునకు కొంతబాధకలిగించును. మరణపూర్వము జీవునకీభువర్లోకవిషయములు బాగుగా తెలిసియున్నచో నీయార్తధ్వనులచే నంత వేధింపబడక నిదురించునుగాని, సామాన్యపుజీవులకు బంధువులమితిమీరినరోదనములు కలత నిదురను గావించి, భూలోకమునకు తిరిగిరావలెననుకోర్కెకలిగించి, వెనుకకాకర్షించి, బాధించును. ఆత్మనిద్ర (Soul-slumber) యనబడునీనిదురనుండి మేల్కనిననేగాని జీవుడు ముందుగలయుత్తమగతులకు పోజాలడు. ఇట్లు చెడగొట్టబడిన నిదురగలజీవులు కొందరు తిరిగి భూమియొద్దకునాకర్షింపబడి యనేకవత్సరములవరకునూ ముందుగతులకు పోజాలకుండుట కనిపెట్టబడెనని గుప్తవిద్యాకోవిదులు (Occultists) చెప్పుదురు. కావున భూలోకములోనిబంధువర్గము, యుత్తమలోకములకు బోవుచున్నతమమిత్రునివిషయమై హద్దుమీరిన దుఃఖమును బొందినచో నామిత్రునియొక్కముందుగతులకు నష్టముకలిగించినవారగుదురు. వియోగము కలిగినప్పుడు దుఃఖముసంభవించుట నైసర్గికమనుమాట వాస్తవమే. వసిష్ఠ మహర్షివంటిజ్ఞానిసహితము తనపుత్రులు విశ్వామిత్రునిచే

పాతులైనపుడు పట్టరానిదుఃఖమునమునింగి యాత్మహత్య చేసుకొనుట కనేకవిధముల ప్రయత్నించెనని మనపురాణముల వలన వినుచున్నాము. కాని నారదుడువచ్చి యతనియవివేకమును వెల్లడిచేయగా వెంటనే జ్ఞానోదయమై దుఃఖసముద్రమును తరించినట్లు, మనము నీప్రకృతిజనితమగుదుఃఖము పొరలిపొరలినసముద్రతరంగములవలెవచ్చినపుడు, పైనవివరించినమరణముయొక్క యదార్థతత్వమును స్మరణకుదెచ్చుకొని సాధ్యమగునంతవరకు దుఃఖమునకు మనస్సునజోటియ్యక, మనస్సున నితరవృత్తులు కల్పించుకొనవలెను. అట్టిమనోవృత్తులలో ముఖ్యమగువృత్తియేమనగా మనమిత్రమునకుమన శ్శాంతిగలుగవలెనని భగవంతునిప్రార్థించుట. ఇట్టిప్రార్థన వలన మరణించినవారికి చాలాలాభముకలదు. ప్రార్థనయనగా, మనస్సునుండిబయలువెడలు నొకబలమైనశక్తి. ఈశక్తి తుపాకీగుండువలె బయలుదేరి, యెవరివిషయమై మనముప్రార్థనచేయుదుమో వారినిచేరును. ప్రార్థన యీమాదిరిగా నుండవచ్చునని యొకగుప్తగ్రంథమున నున్నది.

"ఓధర్మస్వరూపుడవగుపరాత్పరుడా! సమస్తజీవరాసులు నూ నేయేలోకములయందున్ననూ, నేయేస్థితులయందున్ననూ, నెవ్వనియందంతర్భూతమైయున్నవో యట్టినీకు నమస్కరించుచున్నాను. నేనెవరివిషయమై ప్రార్థించుచున్నానో ఆజీవునిపేరునూ, ప్రస్తుతవాసస్థలమునూ, యాతనికగత్యమగుసమస్తవిషయములున్నూ నీకేతెలియును. నీవ

పారమగుదయాపరిపూర్ణుడవుగనుక, యాజీవునకు నుశ్శాంతిని, యానందమును, తేజస్సును సమృద్ధిగా నిమ్ము. ఆజీవునకెప్పుడైనను నేను భూలోకమునకతినవాక్యములచే గాని, క్రియలచేగాని నొప్పిగలిగించియుంటినేని యిది యంతయు నా జీవునిమనస్సునుండి నీయపారపేరిమ చేతూన్చి, యాతడు నానవిూపమునసే యున్నాడను భావమును నా మనస్సునకుగలిగింపుము. ఆజీవుని నేనెంతవిస్మలముగా బేరిమించితినో నీకే యెరుక. ఆతనిని, నన్ను కాపాడు దేవదూతగా నొనర్పుము తండ్రీ!" శాంతి। శాంతి। శాంతి॥

వెనుకజెప్పబడిననిదురనుండి జీవుడు లేచులోపల, నాతని సూక్ష్మశరీరమునుండి విసర్జింపదగినవిషయములు పొరలపొరలవలె విడిపోయి, తనమైహికకర్మచే నేలోకమునసుండుట కర్హుడగునో యాలోకమున మేలుకాంచును. ఎక్కువసత్కర్మ చేసుకొనినవా రెక్కువసూక్ష్మముగులోకమునసూ, నంతకంటె తక్కువసుకృతముగలవారు తక్కువసూక్ష్మముగులోకమునసూ మేలుకొనెదరు. ఈసూక్ష్మలోకములని చెప్పబడునవన్నియూ ఒకదానికంటె నొకటి యెక్కువసూక్ష్మపదార్థనిర్మితములై యుండును. జీవునియొక్క సూక్ష్మశరీరము నాతడు మేలుకాంచు లోకముయొక్క సూక్ష్మతకు సరిగానుండును. ఈలోకములన్నియూ నొకదానిలోనొకటి యంతర్భూతమై యొకస్థలమునందే యనేకలోకము లుండునని యిదివరలో చెప్పియుంటిమిగాని, వేరువేరులోకములలోనుండువా రొకదానినుండి మరియొకదా

నికి విచ్చలవిడిగా పోజాలరు. ఎక్కువసూక్ష్మమగులోకములలోనిజీవులు తక్కువసూక్ష్మములగులోకములలోనికిదిగగలుగుదురుగాని, యధోలోకవాస్తవ్యు లూర్ధ్వలోకమునకు పోజాలరు. "ఊర్ధ్వలోకము" "అధోలోకము" అనివాడుటచే, "సూక్ష్మతరము", "సూక్ష్మము" అనునర్థమేగాని, "ఎత్తు" "పల్లము" అనునర్థమును గ్రహింపగూడదు. ఊర్ధ్వలోకవాస్తవ్యులగుజీవులు, తమస్నేహితులెవరైననూ దిగువలోకములలోనున్నచో నప్పుడప్పుడాలోకములకువచ్చి వారితోకొంతకాలముగడపి పోవుచుందురు.

ఇట్లుదిగుటకు కారణము ప్రేమానుబంధమనునదియే గాక వేరొక కారణముగూడ కలదు. అదేమనగా, ఎగువలోకములోనిజీవులు దిగువలోకములోనిమిత్రులకు సలహావల్లను, బోధవల్లను, యభివృద్ధినిగలుగజేయుచుందురు. అట్లు సమానాభివృద్ధినిబొందుటచే వారిరువురును కర్మానుసారముగా తిరిగిభూలోకమున కొంచెము హెచ్చుతక్కువగా నొక్కపర్యాయమే జన్మమెత్తుచుందురు. దిగువలోకములోనిజీవుడు, తనమిత్రునిబోధచే క్రమముగా నతనితోసమానమగుస్థితికి వచ్చుటచే వారిరువురునూ ఏకకాలమందే ఉత్తరజన్మలెత్తుచూ కలసిపోవుచుందురు.

భువర్లోకములోనిదిగువయంతర్భాగములలో నివసించుజీవులు భూలోకముననున్నప్పుడు ఆముష్మికవిషయమున బహుతక్కువయభివృద్ధిగలవారగుటచే వారిజీవితము కొంచెము

హెచ్చుతక్కువగా వారిభూలోకజీవితమును బోలియుండును. వారుభూలోకక్రియలయం దెక్కువయాసక్తియు, ఆకర్షణమును, గలవారుగాన భూలోకమునకు బహుసమీపమున నున్నారని చెప్పవచ్చును. తమకిష్టమగు దుర్వ్యాపారములెక్కడజరుగుచుండునో యట్టితావులకు సమీపమునదిరుగుచు, సవికనిపెట్టుచు, నట్టివ్యాపారములు తాముచేయుటకభిలాషయున్ననూ మానవశరీరము లేకపోవుటచే తామున్వయముగానట్టిపనులుచేయుటకు వీలులేనందున బాధపడును, వీలుకలిగినప్పుడెల్లనూ నట్టిదుష్టక్రియలనుచేయువారి నావహించుచూ, కాలముగడుపుచుందురు. భూలోకదుర్వ్యాపారములయందుగలయాసక్తి యిట్టిజీవులను శీఘ్రకాలములోనే తిరిగి భూలోకమునకాకర్షించును. కావున నీరు భువర్లోకమునసెక్కువకాలముండక, భూలోకమునతిరిగి జన్మమెత్తవలెనని వాంఛపొడమి, తమగుణముల కనుగుణ్యముగు ప్రవర్తనగలతల్లిదండ్రులకుటుంబమున త్వరలోనే జన్మింతురు. ఇట్టివారికి, భూలోకమునకు గతాగతములు బహుశీఘ్రముగా జరుగుచుండును. ఇట్టివారు సహితమొకజన్మకంటెమరియొకజన్మలో కొంచెమైననూ అభివృద్ధిజెందుచుండుటమాత్రము నిశ్చయము. ఏలయనగా, కాలక్రమమున ప్రతివారునూ, నిచ్చెనమెట్లెక్కినట్లు అభివృద్ధినిజెందుటయే సృష్టిక్రమమైయున్నది.

ఎగువలోకములలోనున్నవా రెక్కువయాముష్మికచింతగలవారగుటచే, పైనచెప్పినజీవులకంటె తక్కువజన్మము

లెత్తుటయేగాక, వారిఒకజన్మకునూ నింకొకజన్మకును నడుమ చాలా కాలము పట్టుచుండును. వారివాంఛలును, అభీష్టములునూ ఉత్కృష్టవిషయములయందు లగ్నమయియుండుటచే ప్రాపంచికవిషయములునూ వాంఛలునూ వారి నాకర్షింపవు. కావున నట్టివారు చిరకాలముత్తమలోకముల లోనుండి యింకనూఎక్కువయభివృద్ధినిబొందుదురు. ఇట్టి వారు శతాబ్దములకుశతాబ్దము లూర్ధ్వలోకములలో గడపుదురు. ఇంకనూఎక్కువయారూఢులగువారు, అనగా శ్రీవివేకానందస్వామినిబోలినయాముష్మికౌన్నత్యముగలవారు, తిరిగి జన్మనెత్తుటకుపూర్వము వేలకొలదిసంవత్సరము లుత్తమలోకములలోనుందురు. కాని, యెట్టిజీవులకైననూ, శీఘ్రకాలమునకైననూ, లేకచిరకాలమునకైననూ తిరిగిభూలోకమున నుద్భవించి, క్రొత్తవిషయముల నేర్చుకొనుటకును, క్రొత్త యనుభవములనొందుటకునూ వాంఛయంకురింపక మానదు. పూర్వజన్మమునందే ప్రారబ్ధముకూడానశించి, వాంఛయును నది వేళ్ళతోనూడపెరికినజీవన్ముక్తులకుతప్ప, తక్కినజీవులకు పుణ్యలోకానుభవము ముగిసినవెనుక పునర్జన్మనెత్తుటకు వాంఛయంకురించును. మరియు, నూర్ధ్వలోకవాస్తవ్యులగు కొందరుజీవులకుసహితము తమతో ప్రేమానుబంధము, కర్మానుబంధము, గలజీవులు తక్కువలోకములోనుండిపునర్జన్మనెత్తుటకుసిద్ధముగానున్నప్పుడు, వారితోకలసి యేకకాలమందే జన్మమునెత్తవలెనని వాంఛకలుగును. అట్టివాంఛ పొడమిన

తోడనే యీజీవులు జననప్రవాహమందుబడి, క్రొత్తజన్మయందనుభవించదగ్గ కర్మ కనుగుణ్యముగు తలిదండ్రులకడఁ బుట్టుదురు. అట్లు గర్భవాసమునఁబడుటకుపూర్వము తిరిగి వారిని "ఆత్మనిద్ర" (Soul slumber) యావహించును. ఆనిదురలో, వారూర్ధ్వలోకమునుండి మరణించి, భూలోకమున జన్మించుట కలుగును. శిశువు జనియించినతోడనే యీ "నిదుర" పూర్తిగావిడువనందున, శైశవావస్థయందు కొంత కాలము స్వప్నదశయందున్నట్లుండును.

పునర్జన్మకు ప్రయత్నముచేయునీవిధాన మంతయు సామాన్యపుజీవులకు వ్యక్తిలోనుండదు. వారికీవిషయమున స్వతంత్రత లేకయే, యాకర్షణశక్తియొక్క శాసనానుసారముగా (Law of Attraction) పునర్జన్మ దానియంతటనది కలుగుచుండును. ఉత్కృష్టపదవినొందినజీవులకుమాత్రము పునర్జన్మనెత్తుస్థలమును, తలిదండ్రులను, కొంతవరకు నెంచుకొనుటకు స్వతంత్రశక్తి కలుగుటయే గాక, జన్మించినవెనుక పూర్వజన్మజ్ఞానముకూడా కలిగియుండును.

దీనినిబట్టి, యూర్ధ్వలోకము లనేకములుగలవనియు, నొకదానికంటెనొకటి యెక్కువయుత్కృష్టమును, సూక్ష్మమునని తెలిసికొనవలెను. ఈలోకములయంతర్భాగములస్థితిగతులనుగురించి ముందుప్రకరణమున నెక్కువవివరములుగా వ్రాయబడును.

ఐదవ ప్రకరణము.

భువర్లోకములోని యంతర్భాగములు.

శ్లో॥ అనిష్ట మిష్టం మిశ్రంచ ।
త్రివిధం కర్మణః ఫలం
భవత్యత్యాగినాం ప్రేత్య
... ... ॥ భగవద్గీత_18 అ_12.

"దుఃఖకరము, సుఖకరము, మిశ్రము, ననుమూడువిధములైనకర్మములయొక్క ఫలము దేహాభిమానులగువారికి మరణానంతరము కలుగుచున్నది"

గతప్రకరణమున భువర్లోకముయొక్క వేర్వేరంతర్భాగములను గూర్చి ముచ్చటించుకొనియున్నాము. ఈయంతర్భాగములన్నిటికిని "భువర్లోకః" మనుసామాన్యనామము వాడబడును. అచ్చటచ్చట "పితృలోక" మనివాడుటయూ కలదు. మరణానంతరము జీవుడునివసించునూర్ధ్వలోకముల ననేకులనేకవిధముల విభజించిరి. కొందరు "వాంఛాప్రపంచము"; [Desire or Astral world] "మనోమయప్రపంచము"(Mental world) అను రెండుపెద్దభాగములుగాజెప్పి, యొక్కొకదానిలో నేడేసియంతర్భాగములును ప్రతియంతర్భాగమునందును పెక్కుసూక్ష్మాంతర్భాగములును కలవని జెప్పిరి మరి కొందరీ రెండుభాగములను "భువర్లోక"మను (Astral plane)

నొక పేరునఁ బిలచి, దీని కనేకాంతర్భాగములుగలవని వ్రాయుదురు. ఒకేవిధమగుగుణకర్మలు గలజీవులందరూ నొకే "స్థితి"ని లేక "గతి"ని లేక "లోకము"న నుందురు. ఈరీతిన వేర్వేరుస్థితులయందుండుజీవులు వేర్వేరుఅంతర్భాగములయందున్నట్లు చెప్పబడును. ఇట్టిస్థితులు లెక్కకుమీరియుండును. ఎందుచేతననగా, మనుష్యులయొక్క గుణసంపత్తి యనేకవిధములుగానుండును. సాధారణముగా నొకరిగుణములబోలియుండుగుణములు మరియొకరికి సర్వవిధముల తుల్యముగా నుండవు. మనుష్యుడు దేహమునుత్యజించినంతమాత్రమున గుణము లేమియూ మారవు. కావున. మరణానంతరము జీవునకు స్థూలశరీరభంగముతప్ప, తక్కినవిషయములన్నియూ యథాపూర్వాకారముగానుండును. అతని వాంఛలు, ప్రేమ, ద్వేషము, మొదలగునవన్నియూ యేమియూమార్పు లేక యుండును. కావున మరణానంతర మాజీవునిసుఖదుఃఖము లీగుణములను బట్టియుండును. విషయోపభోగములయం దెక్కుడభిరుచిగల మానవునకు మరణానంతరదశలు కొంతకాలమువరకూ బహుదుఃఖభాజనముగానుండును. ఇందుకు కారణ మేమన, పంచేంద్రియములవలనను గలుగువిషయభోగముల ననుభవించుటకు స్థూలశరీరము కావలసియున్నది. మరణముతో స్థూలశరీరము భంగమగుటచే, భోగములననుభవించుటకు కావలసినసాధనము (పనిముట్టు) లేనందున నాజీవులకు బాధ బహుమిక్కుటముగా నుండును.

ఈసందర్భమున నొకటిరెండుదాహరణములను తీసి
కొందము. వ్యభిచారమునకుగాని, త్రాగుడుకుగాని యెక్కు
వగా నభ్యాసపడిన మానవులు చనిపోయినతర్వాత. స్థూలశరీ
రములేనందున నాయావాంఛలు పూర్వముకంటె ననేకరె
ట్లుద్రేకమునుబొందియుండును కాని యావాంఛలనుదీర్చు
కొనుటకు స్థూలదేహము లేనందున, నాజీవులుపొందుబాధ
వర్ణనాతీతమైయుండును. ఇదియే నరకానుభవమని చెప్పబ
డును. నరకమనువేరే ప్రత్యేకలోకము లేదనియు, నరకము
ననుభవింపజేయుయముడుగాని యమకింకరులుగాని లేరనియు
యిదివరలోసూచించియున్నాము. ఇదినిశ్చయము. దుష్కర్మ
చేయునరులు, స్వీయకర్మవలన పైనజెప్పినరీతి ననుభవించు
వేదనయే నరకము. కాన, యముడనుపేరున శిక్షవిధించునధి
కారియెవడునూ లేడు తనకర్మవలనగలుగుప్రతిఫలమే శిక్ష.
పామరజనులకు పాపభీతిగలిగించుటకై మనపెద్దలు యమకింక
రులను, వారు చేయు చిత్రవిచిత్రములగు భయంకరశిక్షలను
గల్పించిరి ఇంకొకయుదాహరణమును విచారింతము. నర
హత్యచేసినవాడొకడు యూర్ధ్వలోకమునకుబోయినపుడు,
తానుజేసిన ఘోరకృత్యమంతయూ తనయెదుట మనోనిర్మిత
రూపములచే (thought forms) ప్రదర్శింపబడి, తనచేజంప
బడినవానివిగ్రహ మతిభయంకరముగా కనుబడుచు, తా
నెక్కడకుబోయినను విడువక తరుముకొనివచ్చుచున్నట్లుం
డును. అట్టిజీవుడుపొందెడుబాధ యెట్లుండునో యోచింపుడు!

ఇట్టియనుభవములన్నియూ నరకముగాని. వేరేనరక లోకమనులోకము లేదు. ఈవేదనలన్నియూ జీవునివేధించి వేధించి, కాలానుక్రమమున బలముతగ్గి క్షీణించును. ఇవి యన్నియు జీవునకు మంచిబోధకములుగా పరిణమించి, యీ యనుభవముల ఫలితము మనస్సున కొంచెము నాటియుండి, భవిష్యజ్జన్మలయందాజీవుని దుష్కృతములనుండి క్రమక్రమమున మరలించును.

ఘోరదుష్కృతముల జేసి యిట్టిబాధల ననుభవింతు వారు బహుతక్కువ. సర్వసామాన్యజనులకు మరణానంతర నిద్రనుండి వ్యక్తికలిగిన వెంటనే యుండుచున్నస్థితి యేమనగా, బహుళానందకరమగు స్వేచ్ఛకలిగినట్లు స్ఫురించును. జీవుని నణచిపెట్టిన యినుపకవచమువంటి బరువగుస్థూలశరీరభారము లేదు. తాను చేయవలసినపను లేమియూ నుండవు. కుటుంబ పోషణము మొదలగుబాధ లంతరించినవి. ఆలోకమున శీతోష్ణములు సోకవు. భోజనమునకై పాటుపడనక్కరలేదు. మన సుచేకోరినంతమాత్రమున తనకిష్టమగువస్త్రధారణ మగును.

జీవునకు శక్తులుకూడా అత్యద్భుతముగా వృద్ధియగును. సూక్ష్మదేహమునకు బహువేగముగా ప్రయాణముచేయు శక్తికలుగును. ప్రపంచములోనున్న దివ్యక్షేత్రములుగాని, యేదూరదేశములుగాని చూడవలెనని కోర్కెపొడమినచో బహువేగముగా నచటికి సూక్ష్మదేహము పోయిరాగలదు. మరియు నట్టిప్రయాణములవలన నొంతమాత్రమును యలసట

కలుగదు. ఎందుచేతననగా, యలసటను బొందు స్థూలదేహము లేదు. సంగీతమునందుగాని, యేశాస్త్రములయందుగాని [Sciences] యభిరుచిగలిగియున్న యెడల. ప్రపంచమంతటిలోను పేరొందిన పాటకులను, శాస్త్రజ్ఞులు నుండు స్థలములకు క్షణములోపోయి యానందింపగలిగి యుండును. సంగీతమును స్థూలశ్రోత్రములతో వినలేకపోయినను దానియనుభవము నంతయును పొందును. మరియు, తాను స్వయముగా సంగీతము, శాస్త్రములు మొదలగు వాటియం దెక్కువకృషి చేయుశక్తి కలుగును.

ఈనడుమ చనిపోయిన యొక హిందూదేశ యువతి భువర్లోకమునుండి తనభర్తకు వర్తమానముల నంపుచున్నది. ఆమె భర్తకు నావర్తమానముల నందుకొనుశక్తి కలదు. ఆమె సూక్ష్మశరీరముతో బహుసులభముగా కొద్దినిముషములలో నుత్తరహిందూస్థానమునుండి దక్షిణహిందూస్థానమునకును, యింగ్లాండు దేశమునకును గూడ పోయివచ్చుచున్నట్లు యామె పంపువర్తమానములవలన తెలియుచున్నది.

భువర్లోకమున క్షుత్పిపాసలుండవు. కావున నన్నపానములకు పాటుపడవలసినపని లేదు. ధనముకూడా అనవసరము. దేహసంబంధమగు రోగములపీడ లేదు. చదువరులారా! ఇట్టి దివ్యలోకమునుగూర్చి పోయిన మనమిత్రులవిషయమై మనము దుఃఖించుట యేమిధర్మమో చూడుడు!

వాంఛాప్రపంచము యేడంతర్భాగములుగలది యని చెప్పియుంటిమి. వీటిని లెక్కించుట ఊర్ధ్వమునుంచి, యనగా

సూక్ష్మతమమగు లోకమునుండి చేసినవో, వన్నిటిలో నధమముగానుండునది యేడవది యగును ఘోరదుష్కృతములు జేయువారు దీనిలో వసింతురని యిదివరలో జెప్పబడినది. ఆ జీవులనుభవించు గతులునూ కొంతవరకు వర్ణింపబడినవి. ఈ యధో 'గతి' యందుండు జీవులు భూమికి కొంత లోపలి భాగమందు చిమ్మచీకటిలో విహరించుచుందురు. సూక్ష్మ దేహులగుటచే భూపదార్థము వీరల విహారమున కడ్డు గలుగజేయదు. ఈలోకమునే కాబోలు మనవారు యేడంతర్భాగములుగా భాగించి, అతల, వితల, సుతల మొదలగు నేడు పాతాళలోకములని జెప్పిరి.

సర్వసామాన్య ప్రజలందరున్నూ, ఆరు, అయిదు, నాల్గవ లోకములయందుందురు. ఈ లోకములు మనము నివసించు లోకములోనే యంతర్భూతమై యున్నవి. కావున వారికి మనలోకములోనుండు వస్తువుల సూక్ష్మాంశ లీలోకములలో నగపడుచుండును. అనగా పర్వతములు, వృక్షములు, తోటలు, తటాకములు, నదులు, గృహములు మొదలగునవన్నియునూ సూక్ష్మాంశలచే నిచ్చట గనబడుచుండును. ఆరవలోకములోని జీవితము, స్థూలదేహమును, దానికవసరములగు నన్నపానాదులు మొదలగునవి వినాగా, సర్వవిధముల భూలోక జీవితమునకు తుల్యముగానుండును. క్రమముగా పైకిపోయిన కొలది అనగా అయిదు, నాలుగు, అంతర్భాగములలో, ప్రాపంచిక విషయసంబంధము కొంతవరకు తక్కువగా నుండును.

మూడు, రెండు, నొకటి అంతర్భాగములు బహుసూక్ష్మములగుటచే, నాలోకవాస్తవ్యులవ్యక్తిమండి భూలోకవిషయములు పూర్తిగా నంతర్ధానమగును. ఈలోకములు మిగుల రమణీయములుగానుండునని భువర్లోకమునుండి వచ్చుచున్న వర్తమానములవలన దెలియుచున్నది. ఈలోకములలోనివసించువారు తమమానసికసంకల్పముచేతనే తమతమయిష్టానుసారములగుగృహములు, దేవాలయములు, పాఠశాలలు, పట్టణములు మున్నగువానిని సృష్టించుకొని, వాటిలో యథేచ్ఛముగా దివ్యభోగములననుభవించుచూ, చిరకాల ముందురు. ఈమనోనిర్మితభవనములు, నగరములు, మొదలగునవి, మనలోకమున రాయి సున్నము మున్నగువానితోనిర్మింపబడినవి మనకెంతస్థిరములుగానుండునో ఆసూక్ష్మదేహుల కవియంతస్థిరములుగా గాన్పించుచుండును. ఈలోకములలోని యత్యంతరమణీయములగుతటాకములు, పర్వతపంక్తులు, జలప్రవాహములు వర్ణనాతీతములుగా నుండును. ఇచ్చట వేర్వేరుమతముల వారికి వారివారియిష్టదేవతలు ప్రత్యక్షముగా గోచరించుచున్న ట్లుండుటయే గాక, వారివారిమతానుసారము స్వర్గ మెట్లువర్ణింపబడినదో యాయాతీరున నట్టిసౌఖ్యములు వారిచే ననుభవింపబడుచుండును.

తక్కువలోకములయందుండువారునహితము నాయాలోకములలో వారియనుభవములు ముగిసినతర్వాత, క్రమక్రమమున నూర్ధ్వలోకముల కెక్కుచుందురు. ప్రతిసూక్ష్మ

దేహమందునూ నన్నిలోకములకు సంబంధించినసూక్ష్మపదార్థము కొంచెమో గొప్పదో యుండును. ఒకలోకమునకు సంబంధించినయనుభవము ముగిసినతోడనే యాలోకమునకు సంబంధించినసూక్ష్మపదార్థము తొడుగువలె నూడిపోయి దానిపై ప్రపంచమునకు సూక్ష్మదేహి చేరును. యేలోకములో నెంత కాలముండునదిమాత్రము, సూక్ష్మదేహమున నాయాలోకములకుసంబంధించినపదార్థపరిమాణ మెంతయుండునో దానికనుగుణముగా నుండును.

వాంఛాప్రపంచములోనియన్నియంతర్భాగముల లోను జీవితముముగిసీన వెనుక, జీవుడు వాంఛాశరీరమును విడనాడి, మనోమయశరీరధారియై, మనోమయప్రపంచమున కేగును. ఈలోకమున జీవుడుప్రవేశించినది మొదలు పొందెడియానందము మనుష్యవాక్కుతో వర్ణించుటకేమియూ సాధ్యము కాదు అది యనుభవైకవేద్యమే యనిచెప్పవలెను. ఈలోకమునందలియానందమే తైత్తిరీయోపనిషత్తునందలి యానందవల్లిలో పితృలోకానందమని యిట్లువర్ణింపబడినది:—

"శ్రుతి॥ యువాస్యాత్సాధుయువాధ్యాయికః । ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః । తస్యేయం పృథివీసర్వావిత్తస్య పూర్ణాస్యాత్ । స ఏకోమానుషఆనందః । శ్రోత్రియస్యచాకామహతస్య । తే యేశతం మానుషాఆనందాః । స ఏకోమనుష్యగన్ధర్వాణామానందః । శ్రోత్రియస్యచాకామహతస్య । తే యేశతం మనుష్య

గంధర్వాణామానందాః । స ఏకో దేవగన్ధర్వాణామానందః । శ్రోత్రియస్యచాకామహతస్య । తే యేశతం దేవగంధర్వాణామానందః । స ఏకః పితౄణాం చిరలోకలోకానామానందాః।" ... ...

అర్థము. "యౌవనము, సాధుత్వము, వేదాధ్యయనము, పరిజనము, శరీరదృఢత్వము, ధైర్యము, బలము, ఈభూమినంతను నేలుశక్తి, సంపూర్ణధనము యివియన్నియు నొక మనుష్యునియందున్న వానియానందము యొకమనుష్యానందమని చెప్పబడును. అట్టియానందమునూరింతలుగలది మనుష్యగంధర్వానంద మనబడును. ఈయానందము వేదార్థమెరింగిన, కామము లేని, బ్రహ్మవేత్తకు గలదు. మనుష్యగంధర్వానందమునకు నూరింతలుండునది దేవగంధర్వానందము. ఇదియును వేదార్థమెరింగిన అకామియగు బ్రహ్మవేత్తకు కలదు. దేవగంధర్వానందమునకు నూరురెట్లుండునది చిరకాలము పితృలోకమునందుండుపితృదేవతల యానందము." ... ...

ఇదియే కేవలము ప్రత్యక్షస్వర్గము. ఈస్వర్గసౌఖ్యమందరకునూ సమానముగానుండదు. భూలోకమున నాయా జీవులు చేసుకొన్నసుకృతమునుబట్టియు, మానసికసద్వృత్తులనుబట్టియు, తుల్యములగునానందానుభవములే యిక్కడ ప్రాప్తించును. ఈలోకము, మహోత్కృష్టపదవులనొందినయనేక విభాగములు గలదేవతాసముదాయములకు నివాసస్థానమై

యున్నది. జీవు డీలోకమును జేరినతోడనే తాను మానసికముగాతలంచుతలంపులన్నియు సద్యఃఫలములై ప్రత్యక్షాకృతులనుబొంది వానిచుట్టూ నుండును. ఒకయుదాహరణ తీసికొందము. తాను ప్రాణసమానముగా ప్రేమించినమిత్రము నెవరినైననూ జీవుడుతలంచిన వెంటనే యామిత్రునివిగ్రహము ప్రత్యక్షమై యాజీవునిననుసరించి యుండును. కావున నాలోకములో, మనము యెవరిప్రేమకై యువ్విళ్ళూరుచుందుమో యామిత్రులందరునూ సంకల్పమాత్రమున మనతో ప్రత్యక్షముగా నుందురు. ఈలోకానుభవవిశేషములు వర్ణించుటకు మనుష్యమాత్రునకు శక్యముకాదనుటలో నేమియూ నతిశయోక్తి లేదు. ఈస్వర్గానుభవములు ముగిసినతర్వాత జీవునకు పునర్జన్మవాంఛ యంకురించి, నాల్గవప్రకరణాంతమున జెప్పబడినప్రకారము పునర్జన్మ మెత్తును.

ఆఱవ ప్రకరణము.

భువర్లోకమున ప్రియులసమావేశము.

శ్రుతి॥ యేయం ప్రేతేవిచికిత్సామనుష్యే ।
అస్తీత్యేకేనా యమస్తీతిచైకే
ఏతద్విద్యామనుశిష్టస్త్వయాహం ।
... ... ॥

కఠోపనిషత్తు-ప్రథమవల్లి-20.

"మనుష్యుడుచనిపోయినతర్వాత (ఆత్మ) ఉన్నాడనికొందరును లేడనికొందరునూ చెప్పుచున్నారు. ఈసందేహము నాకునీవలన నివర్తింపబడవలెను."

భువర్లోకజీవితమునుగూర్చి వెనుకటిప్రకరణములలో జెప్పగామిగిలినవి శేషాంశములు గొన్ని యీప్రకరణమున జెప్పబడును.

భూలోకమునుండి క్రొత్తగా భువర్లోకమునకుబోవుటచే నచ్చట ప్రథమమున నిదురనుండిలేచినతోడనే కొందరు తొట్రుపాటుపడెదరు. భూలోకముననున్నపుడే, భువర్లోకవిషయములు జదువుటవలనగాని వినుటవలనగాని దెలిసికొనియున్నవారికీవిషయములజ్ఞప్తి చాలా యుపకరించి, తొట్రుపాటును గలిగించదు. మరణానంతరమేమిజరుగునో యించుకంతయూ దెలియకయే మృతినొందినవారికి కొంతకాలమువరకునూ తొట్రుపాటును, భ్రమయునూ గలుగును. మరణముతో సర్వమూ ముగిసెననియు, ఆత్మయనునదియే లేదనియు వాదించుపరమనాస్తికులు భువర్లోకమునజెందుభ్రమకు మితియే యుండదు. తాముమృతినొందలేదనియు, కలగనుచున్నామనియు, లేక యేదోతమకు తెలియనిమాయచే దాము క్రొత్తదేశమునకుమార్పబడితిమనియు భ్రమించుచుందురు. ఇట్టి యజ్ఞానమును బాపి ముందుదశలను వారికెరుకపరచుటకై మహోత్కృష్టపదవులనొంది, యూర్ధ్వలోకములలోనివసించు జీవులు పలువురు దిగువలోకములకు దిగి, క్రొత్తగా భువర్లోక

ముసకువచ్చినవారికి అజ్ఞానమును బాపి, సేవ జేయుచుందురు. ఈవిషయమునుగూర్చి, జర్మనీయుద్ధమున చనిపోయి, భువర్లోకమునుండి వార్తలనంపుచున్న యొకపాశ్చాత్యు డిట్లు నుడివెను:—

"భువర్లోకవిషయము లిదివరలో తెలిసియున్న వాడనగుటచే, భూలోకమునకు వార్తలనంపుశక్తి శీఘ్రముగా బొందగలిగితిని. నావలె యుద్ధమున జచ్చి యిక్కడకువచ్చినవారనేకులు గలరు. వారిస్థితి బహువిచారకరముగానున్నది. యేలనసగా కొన్నివారములవరకూ తాము మృతినొందిన సంగతియే నమ్మరు. కలగనుచున్నా మనుకొనెదరు. నిదుర లేచినతోడనే నాకునూ స్వల్పనుగువిచారము కలిగెనుగాని, యది చాలాసే పుండలేదు. కనులు తెరచి నాల్గు వైపులకు జూచితిని. క్రొత్తపట్టణమునకు వచ్చినట్లుండెను. నే నది లక్ష్యము చేయలేదు. క్రొత్తజనులతో, అనగా చాలాకాలముక్రింద మనముచూచినజనులతో, నిండియున్న పట్టణమువలె గాన్పించెను. ... ..."

భువర్లోకమున ప్రతివారునూ యిండ్లలో నివసింతురు. వారివారికర్మలననుసరించి దివ్యభవనములుగాని, పేదకొంపలుగాని లభించుచుండును. వారు దుస్తులనుకూడా ధరింతురు. దుస్తులయొక్క రంగులును, విధానమును వారివారిగుణములను వెల్లడించునవిగనై యుండును. ఇవియన్నియూ సూక్ష్మపదార్థ నిర్మితములని యెఱుంగునది. అచ్చటివా రొకరితోనొకరు చిత్రముగుపద్ధతిని ప్రసంగించెదరు. భువర్లోకవిషయములను

గూర్చి సామాన్యముగా కలుగుకొన్న యనుమానములకు సమాధానములు వ్రాసెదను.

1. మరణమునొందినవారు మనలను చూడగలరా? మనమాటలను వినగలరా?

మనము స్థూలశరీరముతో జేయుక్రియలను ప్రత్యక్షముగా చూడలేరు. మనముచ్చరించుమాటలను ప్రత్యక్షముగా వినలేరు. కాని మనమునమీపముగానున్నదీ లేనిదీ, మనము సౌఖ్యముగానున్నదీ, లేక దుఃఖముగానున్నదీ, వారు గ్రహించగలరు. మనస్థూలదేహములను వారు చూడలేకపోయినను మనసూక్ష్మదేహములను జూచుటయేగాక వాటిని గుర్తించగలరు. మనము నిద్రించునపుడు మనవ్యక్తి స్థూలశరీరమును విడిచి సూక్ష్మశరీరమునందుండుటచే, మన మప్పుడు మేల్కొని యున్నట్లు మరణించినవారికి కనుపడుచుందుము. అప్పుడు వారు మనతో ప్రసంగించుచుందురు. మనము నిజముగా నిదురనుండి మేల్కాంచినపుడు వ్యక్తి స్థూలదేహము నాశ్రయించి యుండునుగనుక, మనము నిద్రించుచున్నట్లు వారు తలంతురు. నిదురలో వారితో ప్రసంగించినవిషయములు స్థూలదేహవ్యక్తికి తెచ్చుకొనుసామర్థ్యము మనకు లేదని యిదివరలో చెప్పియుంటిమి. కనుక మరణించినవారు మనలనువిడిచిపోయినారని తలంతుము; కాని వారికిమట్టుకు మనతో వియోగమెప్పుడునూ లేదు. ఏలయనగా సర్వదా మనముగపడుచునే యుందుము.

సుఖము, దుఃఖము, క్రోధము, మొదలగుమానసిక వృత్తులు సూక్ష్మదేహమునందెప్పటికప్పుడు మార్పులను గలిగించుచుండును. కావున నామార్పులను గనిపెట్టి, మనము సుఖముగానున్నామో, దుఃఖించుచున్నామో వారు కనుగొనగలరు.

ఈవిషయములనుగూర్చి పైనజెప్పబడినపాశ్చాత్యభువర్లోకవాసి పంపినవార్తమానములలో నిట్లున్నది:—

"మీరందరునూ నాతో కలసియుండుసమయములునూ గలవు. కాని యవి మీరు జ్ఞాపకముంచుకొనజాలరు. మీరందరునూ రాత్రి నాతో కలసియుందురు; కాని మీరిది మరచుచున్నందులకెంతయూ చింతగా నున్నది. ఈమరపునకు కారణము నాకొకవిధముగా జెప్పబడినది. అదియేమనగా, మానవులు భువర్లోకవిషయములు గూడ జ్ఞప్తిలో నుంచుకొనగలిగినయెడల, రెండు ప్రపంచముల విషయములు మెదడునకు దుర్భరములై భూలోకక్రియలు సరిగా జరుపుటకు వారసమర్థులగుదురు."

2. ఆలోకమునను౦డువారేయేపనులతో కాలము గడపుచుందురు?

భువర్లోకమునుండి వర్తమానములనంపుచున్నయనేకుల వార్తలనుజూడగా, నచ్చటివారిలో హిందువులతప్పకకొంతకాలము భగవధ్యాన, జప, పూజలయందు గడపుచున్నట్లు కనుపడుచున్నది. ఇతరకాలమును సామాన్యముగా వారి

ప్రపంచకాభిరుచులనుబట్టి గడపుచుందురు. అనగా కొందరు పాఠశాలలకును, కొందరు దేవాలయములకును, యుపన్యాసములకునూ బోదురు. కొందరువ్రాయుచుందురు, కవిత్వము చేయుచుందురు, చిత్తరవులువ్రాయుచుందురు, సంగీతము నేర్చుకొనుచుందురు.

3. మరణించినవారు, వెనుకవిడువబడినబంధువులకై విచారించెదరా?

విచారించుట యొక్కొకసమయమున సంభవించును. అట్లువిచారముకలిగినచో వారిముందుగతులకు కొంచెమాలస్యము సంభవించును. కావున నేవిచారములును, మరణించిన వారిమనసులకు గలుగకుండ జేయుట జీవించియున్నబంధుమిత్రులకు గర్తవ్యమై యున్నది.

మరణించినవారిమనసు, వారువదలిపోయినభూలోక జీవితమువైపున కొంతయూ నాకర్షింపబడక, పూర్తిగా వారి నవీనజీవనమున దగిలియుండుటయావశ్యకము. వారు భూలోకమునవదలిపోయినపిల్లలకు సరిగా పోషణజరుగునో లేదోయని మనసున చింతయుండవచ్చును. కావున, మిగిలియున్నయాప్త బంధువు లాపిల్లలను ప్రేమతో పెంచుచున్నయెడల, మరణించినవారిమనసులోనిచింతను బాపి, శీఘ్రముగా నుత్తమగతులకు పోనిచ్చినవారగుదురు. ఇట్లే యితరవిషయములేవైన వారిమనసును బాధించుచుండునని తోచినచో, నావిషయములలో దగినయేర్పాట్లు చేసి, గతించినవారికి మనశ్శాంతి గలి

గించవలెను. దినవారములు జరుపుచున్నప్పుడు ప్రతిదినము ను అన్నము వండి వేయునపు డొక్కొకచో కాకు లాయన్నమును ముట్టుకొనలేదనియు, గతించినవారిమనస్సున నేదో విషయము బాధించుచున్నదనియు చెప్పుట మనము వినుచుందుము. అట్లు సంభవించినపుడు, మృతినొందినవారిమనసున నేకోర్కెగలదో యది యోచించి "నీకోర్కె తీర్చెద"నుని యాపులు మనసున ప్రార్థించినచో కాకులాయన్నమునుముట్టుకొనునని చెప్పుదురు. ఇట్లుప్రార్థించుటయేగాక నాయాపనులను నెరవేర్చుట, మరణించినవారికి తృప్తినిగలిగించుటకు హేతువగును. మన శాస్త్రానుసార ముత్తరక్రియలు జరుపుటవలనను, వారినుద్దేశించి దానధర్మములు చేయుటవలనను చాలాప్రయోజనముకలదు. మనమనోవృత్తులు వారిమనోవృత్తుల నంటుచుండును గనుక, యిట్టిపనులవలన వారికి తృప్తియు మనశ్శాంతియు గలుగు ననుటకు సందియము లేదు.

4. ఆలోకమున స్త్రీపురుషసంబంధ ముండునా ?

భూలోకమున సామాన్యజనులు 'ప్రేమ' కును 'కామము' నకును తారతమ్యమును గనిపెట్టలేకున్నారు. కామమనునది, మలమూత్రపూరితములగుతుచ్ఛమానవశరీరములతో ననుభవించువిషయోపభోగములకై కలుగుకోరిక. ప్రేమ యనునది శరీరాతీతమగుమానసికవృత్తి. భగవంతుడు ప్రేమస్వరూపుడుగనుక, నిశ్చలప్రేమ భగవంతునిస్వరూపము. శరీరమునశించినను ప్రేమ నశింపదు. ఆలోకమున, శరీరముతో

ననుభవింపనగుచున్నభోగముల కవకాశము లేకపోయినను, నిశ్చలమగునన్యోన్య ప్రేమగల స్త్రీపురుషు లచట గలుసుకొనినచో, వారాత్యంతికమగు ప్రేమమైత్రులను, ఈలోకమున కంటె వేయిమడుంగు లెక్కువగా, నెడతెగక ననుభవించుచుందురు.

౬ మనమాలోకమున నొకరినొకరము గుర్తించుకొని కలసుకొందుమా ?

పవిత్రమగు ప్రేమానురాగములు, వియోగదుఃఖము కలిగిన ప్రతివానికినీ ఈప్రశ్నను కలిగించకమానదు. స్వర్గలోకమునందనిర్వాచ్యములగునుత్కృష్ట సౌఖ్యములు మనలను వేచియున్నను, నచ్చట మనము ప్రేమించినవారితో సంయోగము ప్రాప్తించనిచో నాస్వర్గము స్వర్గమే కాదు. స్త్రీపురుష సంబంధము గలవారుమాత్రమే యన్యోన్యసంయోగమును గోరుటగాక, ఆత్మకు స్వతస్సిద్ధముగా, మాతాశిశువులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, మొదలగుసంబంధముగలవారితో సహితము గలసియుండుట కిచ్ఛజనించుచుండును. ఇట్టిప్రేమ గలయందరితో నాలోకమున సంయోగము ఘటిల్లకున్నచో స్వర్గము కోరదగినప్రదేశముగనే దోపదు ఈప్రశ్నకు ఆనంద జనకమగుసమాధాన మున్నందులకెంతియు సంతసించవలసి యున్నది. సూక్ష్మశరీరము లాయాస్థూలదేహములను బోలి యుండునని యిదివరలో జెప్పియున్నాము. కనుక సూక్ష్మదేహములం దొరుల నానవాలుపట్టుట కేమియు కష్టముండదు.

మరియు, మనయాప్తులెచటనున్నారని యీలోకమునందువలె నచట వెదకికొనవలసినపని లేదు. ప్రేమయనునది బలవత్తరమగునాకర్షణశక్తి. నిట్టిబంధముతో గట్టుబడినవారిని, ప్రేమశక్తి తనంతటతానే యాలోకమున నొక్కచోటికి ఆకర్షించును. ఇంతియేగాక, స్థూలదేహమనుసంకిలి భంగమయినపిదప, భువర్లోకమున ప్రేమబంధము భూలోకమునకంటె నెక్కువగాఢతరముగా బంధించును. శరీరసంబంధమగుతుచ్ఛసౌఖ్యేచ్ఛలు ప్రథమములోనే యచట దగ్ధములయిపోయి నిర్మలమగుప్రేమమాత్రము మిగిలియుండి, అది యనుభవించుటకు జీవులకనేకరెట్లెక్కువసామర్థ్యము సిద్ధించును భూలోకముననున్నపుడు. మనము పరమోత్కృష్టసౌఖ్యమెట్లుండునని మనస్స్వబుద్ధిచే నాలోచింపగలమో, అదియంతయు భువర్లోకమున సఫలమై ప్రత్యక్షానుభవములోనికి వచ్చును.

నిర్మలమగుప్రేమానురాగము లుత్తరలోకములలో నెట్లనుభవింపబడునో వర్ణించుటకు మానవభాష చాలదు. నాటకములు, నవలలు, ప్రబంధములు మున్నగుగ్రంథములయందు, నిరువురుస్త్రీపురుషులకు నిరుపమానప్రేమ మెట్లుండవలెనో వర్ణించుట మనము చదివియుందుము. అట్టిపవిత్రప్రేమ యాలోకమున సాక్షాత్కరించుననుటలో నతిశయోక్తి లేదు. అట్టిసాక్షాత్కారమువలన గలుగునానందము ముందర మనుష్యబుద్ధిచే మన మాలోచింపదగ్గపరమోత్కృ

ష్టసౌఖ్యముసహితము బహునికృష్టమును వేయిమడుంగులు తక్కువయును అని చెప్పవచ్చును. గానవిద్యాధురంధరుడని పేరొందినయొకడు, గంధర్వగానమో యనునట్లు గానముచే యుచున్నపుడు, గానవిద్యాప్రవేశముగలవా రాకర్ణించుచూ, మైమఱచి, యానందసముద్రమున నోలలాడుచున్నసమయమున, వారిమనసునకు గలుగునానందము మనమువర్ణించుచున్నభువర్లోకానందలేశమును బోలియుండునని చెప్పఁచో, దాని పరిమితి చదువరుల కించుకబోధపడవచ్చును. సాధారణముగా నిట్టియానంద మెడతెగక యనేకసంవత్సరము లనుభవింపబడును.

కావున, మరణమనునది మానవులను నీచపదవులనుండి మహోత్కృష్టములును, నసమానసౌఖ్యానందదాయకములును, నగుపదవులకు గొనిపోవుమార్గమై యున్నది. ఇట్లనుటచే నకాలమరణమును మానవులు కోరితెచ్చుకొనవలెనని తలంపకూడదు. ఈజన్మమందు నియతమగుకర్మ ననుభవింపనిదే మరణము రానేరాదు; మరియు మనము దానినికాంక్షింపను కూడదు. ఆమరణాంతము నియతకర్మ, నసంగబుద్ధితో జేయుచూ, మృత్యువాసన్నమగునపుడుమాత్ర మేమియును జంకక, యిహలోకముకంటెను నధికసౌఖ్యదాయకములగులోకములకు గొనిపోవుమార్గము మరణముగదా యనుదృఢనిశ్చయము గలిగి, నిర్మలహృదయముతో మృత్యుదేవతను కలుసుకొనవలెను.

మరణానంతరము మహోన్నత సౌఖ్యము ననుభవించుటకై ముందుగా చేయవలసిన ప్రయత్నము లేవియని కొందరు అడుగవచ్చును. జీవితకాల మంతయు స్వేచ్ఛముగా జరపి అంత్యకాలమందు మనసును ప్రపంచవిషయములపైకి బోనీయక భగవదర్పితము చేయుటయే మనము చేయదగ్గ ప్రయత్నమై యున్నది. "అంతే మతిస్సా గతిః" అనునట్లు ప్రాణోత్క్రమణ సమయమున మనసున సద్వృత్తులుంచుకొనుటయూ అత్యావశ్యకము. ఏలననగా, తుదకు మనస్సునందున్న వృత్తులే దేహము విడిచిన కొంతకాలమువరకునూ మనల నాశ్రయించి యుండును.

ఏడవ ప్రకరణము.

భువర్లోకముతో జరుగుచున్న పరిసంగముల నిశ్చయత్వము.

శ్లో॥ నతు మాం శక్యసే ద్రష్టుం ।
మనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః ।
... ...భగవద్గీత-11-8.

"నీ స్థూల చక్షువు చేత నీవు నన్ను చూచుటకు శక్తుడవు కావు. దివ్యదృష్టిని నీకొరకు నిచ్చుచున్నాను ... ..."

వెనుకటిప్రకరణములలో జెప్పబడినయంశము లన్నియు స్థూలనేత్రములచే జూడదగినవి కావు. దివ్యచక్షుస్సుగలవారు మాత్రమే చూడగలరు. "మనము ప్రత్యక్షముగా జూడనిదే యివి నిజమనియెట్లునమ్మగలము" అని ప్రశ్న వెడలుట సహజము. మనప్రత్యక్షానుభవములో లేనియంశములను గూడ మనము కొన్ని సమయములయందు ప్రమాణములుగా నంగీకరించుచున్నాము. నేను నాతల్లిగర్భమునుండి జనించినా ననువిషయము నాప్రత్యక్షానుభవములోనిది గాకపోయిననూ, పెద్దలవలన వినుటచే నదియదార్థమని నమ్ముచున్నాను. దీనినే శబ్దప్రమాణమని చెప్పుదురు. ఇట్టివిషయములలో ప్రత్యక్షానుభవ ముండిననేగాని నమ్మజాలననుటకు వీలులేదుగదా. ఇంకొకయుదాహరణము తీసికొందము.

ఇంగ్లాండుదేశమనునది మనలోచాలామంది స్వయముగా చూచియుండలేదుకదా. అయిననూ నాదేశముపోయి చూచివచ్చినవారు చెప్పుటచే మనము నమ్ముటలేదా? ఈతీరుననే భువర్లోకవిషయము లందరునూ స్వయముగా చూచుటకు సామర్థ్యముకలవారు కాకపోయిననూ, నట్టిశక్తులను సంపాదించినవారు తమయనుభవములను జెప్పినప్పుడు, వారు మోసగాండ్రుకాక విశ్వసనీయులైనచో మనము వారిమాటలేలనమ్మకూడదు? అట్టిసామర్థ్యములను మనమునూ కృషిజేసి సంపాదించినచో, నాయావిషయములు మనకునూ ప్రత్యక్షగోచరములు కాగలవనుటకు సందేహము లేదు.

గతించినవారితో మాటలాడుట యనునది యిప్పుడు యింగ్లాండు, ఫ్రాన్సు, అమెరికా, ఇటలీ మున్నగుదేశములలో నతిప్రాబల్యముగా నున్నది. ఈశక్తి యిప్పుడు క్రొత్తగా కనిపెట్టబడినది కాదు. క్రీస్తుశకమునకుపూర్వమే చైనా దేశస్థుల కీశక్తి కలదని గ్రంథములవలన తెలియుచున్నది. క్రైస్తవులు సామాన్యముగా పునర్జన్మము నమ్మకపోయిననూ, బైబిలు (Bible) సూక్ష్మముగా బరిశీలించుచో యేసుక్రీస్తు కే ఈశక్తియున్నట్లు కొన్ని సందర్భములలో గనబడుచున్నది. మనహిందూదేశమన్ననో యీశక్తికి పుట్టినిల్లైయుండెను. పూర్వము యోగులకనేకుల కీశక్తియు, నింతకంటె నెక్కువ సిద్ధులును ఉండెడివి. తమకిట్టిసిద్ధులుండుటయేగాక పూర్వము యోగీశ్వరులు తమయోగబలముచే సామాన్యజనులనుసహితము పితృలోకమునకు దీసికొనిపోయి గతించినవారినగపఱచినట్లు నిదర్శనములు కలవు. పంచమవేదమని ప్రసిద్ధికెక్కిన శ్రీమహాభారతమున ఆశ్రమవాసపర్వమున నిట్టియుదాహరణమొకటికలదు. భారతయుద్ధానంతరమున పదియారుసంవత్సరములకు శ్రీవేదవ్యాసుని, గాంధారియు, మృతినొందినదుర్యోధనాదుల భార్యలునూ కోరంగా నాయోగీశ్వరుడు వారలందరకునూ బితృలోకమున నున్నదుర్యోధనాదులను గనుపఱచెనని చెప్పబడి యున్నది. ఇట్టిసామర్థ్యము లీకాలమున జాలవరకడుగంటుటయేగాక, నట్టివిషయములనుగురించి ముచ్చటించుచో బరియాచకము చేయుస్థితిగూడ సంభవించినది. పాశ్చాత్య

నాగరికతతో సంబంధముకలిగినది మొదలు నాస్తికతయు, మనశాస్త్రములయం దపనమ్మికయు ప్రబలమైనవి. ఇప్పుడు మనలో చదువుకొన్నవారిమనస్థితి యెంతటికివచ్చినదనగా, మనవారు చెప్పువిషయములన్నియు మనము ప్రత్యక్షముగా జూచిననేగాని నమ్మగూడదనియు, నావిషయములనే యితర పాశ్చాత్యులు చెప్పినచో వేదవాక్యములవలె నమ్మవలెననియు, చెప్పునట్టియవస్థకు వచ్చినది. కావున, పితృలోకవాస్తవ్యులతో నింగ్లాండు మొదలగుదేశములలోని పాశ్చాత్యశాస్త్రవేత్తలు ముచ్చటించి స్థిరపరచినవిషయము లిచ్చట గొంతవిపులముగా వ్రాసినచో మనవారికెక్కువనమ్మిక గలుగునుగాన, నట్లుచేయ సమకట్టితిని.

తత్వజ్ఞాన సమాజమువారు (The Theosophical society) మరణానంతరదశలనుగురించి యెక్కువపరిశోధనలను జేసిరి. వీరిలో నగ్రగణ్యులు, సి॥ డబ్లియు లెడ్‌బీటర్ (Rev. C. W. Leadbeater) మున్నగుపాశ్చాత్యులుకొందరు తమ పూర్వజన్మసుకృతముచే గొప్పశక్తులను సంపాదించి, సూక్ష్మదేహములతో పిత్రులోకమునకుబోయి అచ్చటివిషయములను పరిశీలనను జేసిరి. ఇట్టివా రనేకులు వేరువేరుగా పరిశోధనలను జేసి, అనగా నొకరిపరిశోధనవిషయములను మరియొకరికి వెల్లడించక, తుదకు దమతమపరిశోధనక్రమమునంతనూ పెద్దమనుష్యులయొద్ద ఋజువుచూపగా, నందరిపరిశోధనలవలననూ నొకేతీరునవచ్చినవిషయములనే సరియనియంగీకరించి ప్రక

టించిరి. ఈసమాజము వారివ్రాతలయందునూ గొందరికి నమ్మకము లేకపోవచ్చును. ఇది యిట్లుండనిండు. ప్రస్తుతము పాశ్చాత్య దేశములలో శాస్త్రవేత్తృసార్వభౌము లని (Eminent scientists) ఘనతవహించినయనేకు లీవిషయములనుగురించి శాస్త్రీయపద్ధతులప్రకార మనేక సంవత్సరములు తమజీవితకాలమంతయు వినియోగించి పరిశీలనలు జేసి, "చనిపోయినవారు నిశ్చయముగా చనిపోలే" దనియు, వారితో ప్రసంగించుట సాధ్యమనియు నైకకంఠ్యముగా స్థిరపరచిరి. ఇంగ్లాండుదేశమున సుమారు 40 సంవత్సరముల క్రిందట, నీవిషయములనుగురించి పరిశోధనలు చేయుటకై యొకసంఘ మేర్పడి (Society for psychical research) యందు వివిధశాస్త్రవేత్తలలో ప్రముఖులు జేరి, ప్రతిసంవత్సరము నూ వారిపరిశోధనఫలితములను ప్రకటనపఱచిరి. వీరి పరిశోధనవిధానముల విచ్చటవ్రాయుట కవకాశము లేదు గాని, యీసమాజము వారు ఖండనావకాశము లేనిశాస్త్రసమ్మతిసాక్ష్యముపై నీదిగువ యంశములను స్థిరపఱచిరి:—

1. మనుష్యుడు చనిపోవుటచే స్థూలశరీరమును మాత్రము విసర్జించునుగాని, అతనిమామూలుజీవితము నూతనమగుస్థితిగతులనడుమ యథాప్రకారము నడచుచునేయుండును.

2. స్థూలదేహవిముక్తుడగుజీవుడు, శరీరమనెడి 'పనిముట్టు' 'సాధనము' యొక్కసహాయములేకనే, స్థూలదేహముగలవారికి తనయభిప్రాయములను వెల్లడిచేయగలడు.

ఈసమాజమునకధ్యక్షుడుగానుండి, యిప్పటికినీ సజీవుడుగానున్నట్టియు, ఇంగ్లాండులో ప్రస్తుతపుశాస్త్రజ్ఞులలో (Scientists) సగ్రగణ్యుడని పేరొందినట్టియు సర్ ఆలివర్ లాడ్జి (Sir Oliver Lodge) యనుమహానుభావుడు తనజీవితమునంతనూ ఈపరిశోధనలకు వినియోగించుచున్నాడు. ఈయన కుమారుడు 'రైమాండ్' (Raymond) అనునాయన జర్మనీ యుద్ధములో 1915 సం॥రములో మృతినొందెను. ఆయన భువర్లోకమునకుబోయినది మొదలు ఆలోకమునుండి తండ్రికి వర్తమానముల నంపుట కారంభించెను. ఈవర్తమానముల నంపువిధానము ముందుపరిశరణమున వ్రాయబడును. లాడ్జి దొరగారు రావర్తమానముల నన్నిటినీ బహుజాగరూకతతో నందుకొని, అవి శాస్త్రోక్తవిధానములచే(scientific methods) బరిశీలించి యొకగ్రంథమును బ్రకటించెను. లాడ్జిగారివంటి ప్రసిద్ధశాస్త్రవేత్త, భువర్లోకవర్తమానములు, నిజముగా మరణించినవారియొద్దనుండి వచ్చుచున్నవని స్థిరపరచి ప్రపంచమునకు జాటుటచే. పాశ్చాత్యదేశీయులందరునూ వారినహజనాస్తికత్వమును వదలి, మరణమునుగురించి వారియభిప్రాయములను మార్చుకొనిరి. లాడ్జిగారివలెనే, పశ్చిమదేశవిద్వాంసులనేకులు కొ్రమమగుశాస్త్రీయపద్ధతులవరికారము పరిశోధనలను (experiments) జేసి యందరునూ నైకకంఠ్యముగా భువర్లోకవర్తమానములు నిశ్చయములని స్థిరపరచిరి. వీరిలో కొందరుప్రముఖులను జేర్కొనెదను. వారెవరనగా (1) సర్

విలియం క్రూక్సు [Sir William Crookes], (2) సర్ ఆర్థర్ కోనన్ డాయిల్ [Sir Arthur Conan Doyle], (3) ప్రొఫెసర్ హిస్‌లాప్ [Professor Hyslop], (4) డాక్టర్ గిలీ [Dr. Geley of Paris], (5) డాక్టర్ క్రాఫర్డు [Dr. Crawford], (6) ఛార్లస్ రిచెట్ [Charles Richet of France], (7) లంబరాసో [Lombroso of Italy], (8) ఎడ్వర్డు రెండాల్ [Edward Randall of America]. వీరల యభిప్రాయములను, పరిశోధనలను, బహుసంక్షేపముగా నుదహరించెదను.

సర్ ఆలివర్ లాడ్జిగా రిట్లువ్రాసిరి:—

"భూ, భువర్లోకములనడుమ వర్తమానములనంపుకొనుట సాధ్యమనియు, భువర్లోకవాసులు సుఖముగాను, సద్వ్యాపారములతోను జీవనముగడపుచున్నారనియు, వెల్లడించుటచే దుఃఖోపహతులగువారి కీవిషయములు మనశ్శాంతి నిచ్చు ననునభిప్రాయముతో భువర్లోకమునుండి నాకుమారునిచేబంపబడినవార్తలను ప్రకటించితిని."

"మనమందరమూ నొకేప్రపంచమున నున్నామనియు, నాప్రపంచములో నొకభాగముమాత్రము (స్థూలప్రపంచము) భూలోకవాస్తవ్యులకును, నింకొకభాగము (సూక్ష్మప్రపంచము) భువర్లోకవాస్తవ్యులకును గోచరమగుననియు, నాకుతోచుచున్నది."

"మరణమువలన మనుష్యున కత్యంతమగుమార్పుకలిగ నని తలంపకుడు. వానిజీవితము భూలోకమునకంటె

నెక్కువపవిత్రిము, సౌఖ్యదాయకము నగులోకమునకు మాత్రము, గుణవిశేషములలోమాత్రముపూర్వ కలుగదు"

"మరణానంతర మనేక 'స్థితులు' గలవు. ఎవరికితగ్గస్థితికి వారుపోదురు"

"మరణానంతరము క్రొత్తస్థితిగతులలో మనుష్యజీవనము జరుగుచున్నదనియు, నచ్చటివారికినీ మనకునూ సంభాషణ జరుగుట సాధ్యమనియు నేజెప్పెడుమాట దుఃఖోపశమన ముకొఱకు జెప్పునది గాదు. ఈయభిప్రాయము పరిశోధన చేతను, ఆత్మానుభవముచేతను నామనసున క్రమక్రమ ముగా పాతుకొన్నది. రసాయనశాస్త్రమందలి (Chemistry) పరమాణువులను గురించిన విషయము [atomic theory] వలెనే నిదియు కడువిశ్వసనీయమని నాతాత్ర్యము."

"మనము వేరువేరుప్రపంచములలోనున్నను, ప్రేమానుబంధ మున్నంతవరకు నొక కుటుంబములోనివారమై యున్నాము."

"విషయములయొక్కస్మరణ [Memory] శరీరము ననుసరించియున్నదిగాదు. ఇది మనసునాశ్రయించి యుండును. కావున శరీరముపోయినను స్మరణ నిలిచియుండును."

"శరీరములయొక్కసహాయములేకయే, యొకమనసునుండి యభిప్రాయములను మరియొకమనసునకు బంపవచ్చును.

కావున శరీరవిహీనులగుజీవులు [disembodied spirits] శరీరయుక్తులగుజీవులకు [embodied spirits] వర్తమానముల నంపుట సాధ్యము."

"మృతినొందినమనప్రియులు సౌఖ్యముగాను, మనయందుబ్రేమగలవారుగాను, మునుపటికంటెనెక్కువసజీవులుగాను నున్నారని నిశ్చయముగానమ్మి, మనముకూడా వారినికలియునంతవరకును నీలోకమున నుపయోగమగు జీవనమును జరుపవలెననియు, నేనందరకును నొక్కిచెప్పుచున్నాను."

"మృతినొందినవారెక్కువయాతురతతో ముందుజెప్పువిషయము లేమనగా, తాము క్రొత్తస్థితిగతులలోనికి పోయినను తమప్రేమగాని, జ్ఞాపకముగాని యేమియు క్షీణించలేదని చెప్పుదురు."

"మన మీలోకమున జీవించియున్నామనువిషయము నాకెంతనిశ్చయముగా దెలియునో, మరణానంతరము జీవనము కలదనువిషయమునుగూర్చియు నాకంతనిశ్చయముగా తెలియును."

సర్ విలియమ్ కూక్సుగారు [Sir William Crooks] సుప్రసిద్ధుడగునింగ్లాండుదేశపురసాయనశాస్త్రవేత్త [Eminent chemist]. ఈయన మిస్ కుక్ [miss cook] అనునొక యువతిసహాయముచే 8 సంవత్సరములు పరిశోధనలుచేసెను.

ఈయువతికి చనిపోయినవారి నాకర్షించుసామర్థ్యము కలదు. క్రూక్సుదొరగారీమెను నొకచీకటిగదిలో కొంతసేపు మూసి యుంచెడివారు. అట్లుమూసియుంచినసుమారొకగంటకు నా దొరసాని స్పృహలేకపడియుండుటయు, నాప్రక్కగదిలోని కింకొక క్రొత్తదొరసాని యావిర్భవించుటయు గనిపెట్టబడెను. ఈక్రొత్తగాపుట్టినస్త్రీ మాటలాడుచు నడచివచ్చి తన పేరు "కేటీకింగు" [Katie King] అనియు, తాను Charles II రాజ్యకాలములో నివసించియుండినస్త్రీయనియు, స్వల్పకాలము భూలోకమునకు వచ్చి, కుక్ దొరసాని శరీరమునుండి తాత్కాలికముగా నిర్మింపబడినశరీరముతో భూలోకమున విహరించుట కాజ్ఞయీయబడెననియు చెప్పుచుండును. ఈమె, కుక్ దొరసానికంటె 4½ అంగుళములు యెక్కువపొడుగును, వేరువిధమగు కేశలవెంట్రుకలను గలిగియుండెను. ఈమె నాడిని పరీక్షింపగా, కుక్ దొరసానినాడికంటె వేరువిధముగా నుండెను. ఈక్రొత్తశరీరము కుక్ దొరసానిశరీరమునుండి యావిర్భవించువిధ మెట్లనగా, ఆమె స్పృహలేక పడియున్నపుడు ముందుగా యామెశరీరమునుండి యావిరివలె బయలుదేరును. క్రమముగా నాయావిరి చిక్కపడి జిగురువంటిపదార్థముగా మారి తుదకు మనుష్యాకృతిని బొందును. ఆమనుష్యవిగ్రహము కుక్ దొరసానిశరీరమునుండి వేరుపడి, చైతన్యమును బొంది భూమిపై సుమారొకగంట విహరించును. అట్టి సమయములో నామె క్రూక్సుదొరగారితో మాటలాడుట,

వారిపిల్లలతో యాడుకొనుట, కథలు చెప్పుట, మొదలగుపనులు చేయుచుండెను. తిరిగియామె క్రమక్రమముగా నదృశ్యమై, యామెశరీరమును నిర్మించిన "సూక్ష్మజాతము" మరల యావిరిరూపమున కుక్ దొరసానిశరీరములోనికి బోవును. ఇట్లు కొన్నిసంవత్సరములు పరిశోధనలు జరిగినతర్వాత నొకరోజున యామె యదృశ్యమగునపుడు "భూమిమీద నాకర్తవ్యముముగిసినది" అనిచెప్పి పోయెను. నాటనుండియూ ఆమె తిరిగికనుపడలేదు. ఆమె "కర్తవ్య" మేమయియుండునని చాలామంది యోచించగా, నాస్తికులగుపాశ్చాత్యుల కిట్టివిషయములలో నమ్మికపుట్టించుటయే యామెకర్తవ్యమని సర్ ఆర్థర్ కోనన్ డాయిల్ గారు నుడివిరి. 'ఫ్రాన్సు'వాస్తవ్యులగు డాక్టరు గీలీగారునూ నిట్టిపరిశోధన లనేకములు చేసి, తుదకివి నూరుగురుశాస్త్రవేత్తలయెదుట ప్రదర్శించిరి. భూతముల నాకర్షించుశక్తిగలవారిలో [Mediums] కొందరికి, 'మెటీరియలైజేషన్'(Materialization) అనునుత్కృష్టశక్తి యుండునని, (అనగా భూతములు తాత్కాలికముగా నుపయోగించుటకు తమశరీరమునుండి "సూక్ష్మజాతము"చే క్రొత్తశరీరమును నిర్మించుట) స్థిరపరచిరి. "మనము కన్నులారా చూచినదంతయు నాస్తికత్వమును మొదలంటచ్ఛేదించినది" అని వీరభిప్రాయ మిచ్చిరి.

డాక్టర్ క్రాఫర్డు [Dr. Crawford] గారును నిట్టిపరిశోధనలనేజేసి, నున్నితమగుయంత్రములనుగూడ నుప

యోగించి ఎవరిశరీరమునుండి 'సూక్ష్మజాతము' బయలువెడలునో ఆమనుష్యునిశరీర ప్రమాణమున సుమారు $\frac{1}{3}$ బరువుతగ్గునని కనిపెట్టిరి. " 'సూక్ష్మజాత'శరీరములలో ప్రవేశించి పనులుచేయువారు ఇదివరలో మృతినొంది దేహవిముక్తులుగా నున్నజీవులేయని నాకుపూర్తిగా నమ్మకము గల" దని వీరభిప్రాయమిచ్చిరి.

సర్ ఆర్థర్ కోనన్ డాయిల్ [Sir Arthur Conan Doyle] గారును పరిశోధనలజేసి "మృతినొందిననాతల్లి ప్రత్యక్షముగా స్థూలదేహముతో ననేకపర్యాయములు నాకు కనుపడెను" అనివ్రాసిరి.

గ్రామాఫోను [Gramaphone] కనిపెట్టిన ఎడిసన్ [Edison] అను గొప్పశాస్త్రవేత్త బహుచిత్రమగుయంత్రమొకను గనిపెట్టుటకు ప్రయత్నించుచున్నాడట. అదియేమనగా గ్రామాఫోనునుండి మనము పాటలనువినుతీరుననే, దేహవిముక్తులగుజీవులయొక్క [Disembodied spirits] మాటలను మనము వినగలుగుయంత్రమునకై ప్రయత్నించుచున్నారట. వీరికి సహకారిగా పనిచేయుచున్నయింకొకశాస్త్రజ్ఞుడు మృతినొంది పైలోకమునకు బోయెను. శ్రోత్రయంత్రమును గనిపెట్టుటకు ఎడిసన్ గారుచేయుకృషియంతయూ నాయనకు తెలియునుగాన, భువర్లోకమునుండి యాయన సహాయముచేయుననియు, మొట్టమొదట నీయంత్రముగుండా నాస్నేహితుడే మాట్లాడుననియు ఎడిసన్ గారినమ్మకయట !

"దేహవిముక్తులగుజీవు లున్నారని యొప్పుకొననివారు మూర్ఖులైనను కావలెను. క్రొత్తవిషయముల నంగీకరించుటకు సాహసము లేనిపిరికివారైనను కావలెను" అని ప్రొఫెసర్ హిస్లాప్ (Proff. Hyslop) గారు వ్రాసిరి. వేల్ ఓవెన్ (Rev. Vale Owen of Oxford గా రీవిషయములలో 25 సంవత్సరములు పాటుపడిరి వీరు మొదటనాస్తికులై యుండి, క్రమక్రమముగా వీరికి భువర్లోకవర్తమానముల నందుకొనుశక్తి గలుగుటచే. వేనవేలు వర్తమానముల న్వ్యయముగా నందుకొని రెండుగ్రంథములుగా ప్రచురించిరి. "దేహము లేనిజీవులతో ప్రసంగించుట నిశ్చయమని నమ్మకకలుగుటకు నాకు పదిసంవత్సరములు పట్టినదీ. అట్లుప్రసంగించుట మంచిదని తోచుటకు నింకొక 15 సంవత్సరములు పట్టినది" అని యీయన వ్రాసిరి. ఎడ్వర్డు రెండాల్ (Edward Rendall) అనునాయన, మృతినొందినవారినుండి వర్తమానములు వచ్చునని చెప్పగా పరిహాచకము జేసి నవ్వుచుండెడివాడట. ఈయనకు కాలక్రమమున స్వాయముగా నట్టిశక్తికలిగి, యనేకవర్తమానముల నందుకొని చాలాగ్రంథములను వ్రాసెను. ఈయన స్వానుభవమునుబట్టి యిట్లు వ్రాసిరి. "సుమారు ఇరువదిరెండుసంవత్సరములలో నప్పుడప్పుడు, మొత్తముమీద 700 రాత్రులయందు నాయింటిలో నశాస్త్రీయవిధానముల మూలమున (Scientific conditions), మృతినొంది రనిచెప్పబడువారితో నేను ముఖాముఖని మాట్లాడితిని. వారు తా

త్కాలికముగా శరీరములను నిర్మించుకొని ప్రత్యక్షమగుట జూచితిని. ఆశరీరములను ముట్టుకొంటిని. వారితో మాట్లాడితిని. వారి వాక్యములు స్పష్టముగా నుండెను. ఒక్కొకసమయమున వారి కంఠధ్వని నాయిల్లంతయు మ్రోగునంతగట్టిగా నుండెను.''

చదువరులారా! ఈగుప్తవిద్య పాశ్చాత్యదేశములలో నెంతప్రబలముగానున్నదో చూచితిరా? మనభరతవర్ష మీట్టి విద్యలకు పుట్టినిల్లయియున్నను నేటికాలమున నీవిద్యలయందునపహితము పాశ్చాత్యులచే మనమోడింపబడు టెంతయు శోచనీయము. పితృలోకవాస్తవ్యులతో ప్రసంగించగలశక్తిగలవా రిప్పుడు పశ్చిమదేశములలో ననేకులు కలరు. ఎవరి యింటనైనను మృత్యువుసంభవించినప్పుడు వారు తత్క్షణమే యీ యద్భుతశక్తిగలవారియొద్దకు పోయి మృతినొందినతన యాప్తునియొద్దనుండి నమ్మిక బుట్టించుసమాచారములను దెప్పించుకొని, దుఃఖోపశమనము గావించుకొనుచున్నారు. పట్టుదల, కృషి, శాస్త్రశోధన (Scientific research) యనుగుణములకు పాశ్చాత్యులదే పెట్టినదిపేరు. మనవారి కీగుణములు లేకపోవుటచే నీవిద్యయందు కృషి మనదేశమున లేనేలేదు. కావున, మృతినొందినమిత్రులయొద్దనుండి వార్తలదెప్పించు సౌభాగ్యము మనదేశమున లేదు.

ఎనిమిదవ ప్రకరణము.

భువర్లోకముతో ప్రసంగవిధానములు-భువర్లోక లేఖలు.

శ్లో॥ యాన్తి దేవవ్రతా దేవాన్ ।
పితౄన్ యాన్తి పితృవ్రతాః ।
భూతాని యాన్తి భూతేజ్యాః ।
... ... ॥ భ-అ9-25

" దేవతలనుగూర్చి వ్రతములుచేయువారు దేవతలను, పితృదేవతలనుగురించి వ్రతములుచేయువారు పితృదేవతలను, భూతములను బూజించువారు భూతములను, బొందుచున్నారు"

భువర్లోకవాసులతో ముచ్చటించుట సాధ్యమని పైప్రకరణమున జెప్పబడినది అట్లు ప్రసంగించువిధానము లేవియో కొంచెమైననూ జెప్పకపోయినచో నీపుస్తక మసంపూర్తిగా నుండుననుభీతిచే క్లుప్తముగా నావిధానములను వివరించి, మచ్చునకు గొన్నిభువర్లోక లేఖలను వ్రాసి ముగించెదను.

ఈసందర్భమున నొక్కవిజ్ఞాపన జేయవలసియున్నది. ఇంగ్లీషుమాటలకు సరియగుపర్యాయపదములు తెనుగునలేనందున నికముందువచ్చువిషయములో గొన్నియింగ్లీషుమాటలే వాడవలసివచ్చినది.

"సైకికల్ రీసెర్చి సొసైటీ" వారు (Society for Psychical research) మిక్కుటమగు శాస్త్రీయపరిశోధనల పైని స్థిరపరిచినముఖ్యసారాంశము లేమనగా:—

"స్థూలపదార్థసహాయములేకయే, యొక మనసునుండి మరియొకమనసునకు వార్తల నంపవచ్చును. మనసు స్థూల దేహమునుండి వేరుపడిపోయినను, స్వకీయలోకమునందుండి పనిచేయగలదు." ఈసారాంశములనుబట్టి మృతినొందినవారు స్థూలదేహవిముక్తులయినను తమమనసుగోని యభిప్రాయములను వెల్లడిచేయగలరని తేలుచున్నది - ఏలనగా, మరణకాలమందు జీవుడు తనవెంట సూక్ష్మదేహమును గొనిపోవునని యిదివరలో జెప్పియుంటిమి; మరియు నా సూక్ష్మదేహమున మన సత్త్వముకూడా చేరియుండును. ఇంతవరకు నొప్పుకొనినతర్వాత దేహవిముక్తజీవులు (Disembodied spirits) తమ యభిప్రాయముల వెల్లడిజేయువిధానము లేవియని ప్రశ్న బయలు వెడలును. ఈవిధానములలో సాధారణముగా ముగ్గురు పనిజేయువా రుండవలెను.

1. 'సూక్ష్మశక్తి' (Psychic power) గల పురుషుడు గాని, స్త్రీగాని. ఇట్టివారిని ఇంగ్లీషుభాషలో "మీడియం" "Medium" అందురు. అనగా "మధ్యవర్తి" యని తెనుగులో జెప్పవచ్చును. ఏలనగా వీరు భూ, భువర్లోకములనడుమ వర్తమానముల నందిచ్చెదరు. ఈశక్తి యందరకునున్నను, కొం

దరిలో మాత్రి మిదివ్యక్తముగా నుండి ఉపయోగపడును. అట్టివారే "మధ్యవర్తులు" ("మీడియమ్స్") అగుదురు.

2. "స్పిరిట్ మీడియం" ("కంట్రోల్") (Spirit Medium or control.) అనగా సమాచారములు చెప్పుటకై "మీడియం"ను ఆవహించుభువర్లోకదూత. ఈలోకమునందు వలెనే యాలోకములోనూ ప్రతివానికిని, భూలోకమునకు సమాచారముల నిచ్చుశక్తి యుండదు. అట్టిశక్తిగలవారు "కంట్రోల్" అనబడుదురు.

3. వార్తనంపుభువర్లోకవాసి.

భువర్లోకమునుండి వార్తనంపదలచినవారు, అక్కడ నుండు "కంట్రోల్"ను కలుసుకొని వారితో జెప్పుదురు. ఆ 'కంట్రోల్' భూలోకములోని (మీడియం) 'మధ్యవర్తి' నావహించి వానిద్వారా వర్తమానము జెప్పును. ఈయావహించుటలోను ననేకవిధములు గలవు:—

1. Trance speaking:—(సమాధియవస్థలో మాట్లాడుట:) "సూక్ష్మశక్తి" గలవారు Medium శరీరస్మారకమును మరచి సమాధియవస్థకు పోదురు. అప్పుడు 'భువర్లోకదూత' (Control) యాశరీరము నావహించి, 'మీడియం' యొక్క వాగింద్రియము నుపయోగించి, భువర్లోకవార్తలను వాని నోటిగుండా పలుకును. ఆసమయమున దగ్గరనున్నవారు రవి వ్రాసుకొందురు. అప్పుడు 'మీడియం'కు తనశరీరమునందు వ్యక్తియుండదు. వర్తమానము జెప్పుట ముగిసినతర్వాత,

‘భువర్లోకదూత’ మీడియంయొక్క శరీరమును వదలును. అప్పుడు ‘మీడియం’కు తిరిగి స్పృహ వచ్చును. కొన్నిసమయములలో ‘మీడియం’కు తెలియనిభాషలోనహితము సమాచారములు వచ్చును. ఉదాహరణ:—‘మీడియం’కు హిందీ భాష రాదనుకొందము. హిందీభాష తెలిసిన ‘భువర్లోకదూత’ వాని నావహించినపుడు వాడు శరీరస్పృహలేకయే హిందీలో ప్రసంగించును.

2. Trance writing:—(సమాధియవస్థలో వ్రాత): పైనచెప్పినప్రకారము ‘మీడియం’ సమాధియవస్థకు బోయిన తర్వాత, భువర్లోకదూత వానిచేతినిమాత్ర ముపయోగపరిచి, దగ్గిరనుంచబడిన పెనసలు నందుకొని, యెదుటనున్న కాగితముపై సమాచారమును వ్రాయును. ఆసమయమున ‘మీడియం’కు స్పృహయుండదు. వ్రాత ముగిసినవెనుక, యావహించినదూత వదలిపోవును. చేతినుండి పెనసలు జారిపోవును క్రమముగా ‘మీడియం’కు స్పృహ వచ్చును. ఇట్టి శక్తిగలయొకపురుషుని నే నెరుగుదును. ఈయనను నాల్గు మాసములు నాయొద్దనుంచుకొని నాసమక్షమున పరిశోధనల జరిగించితిని. ఈయన సమాధియవస్థకుబోవునపుడు అనేక పర్యాయములు సూక్ష్మముగా పరిశీలించి, నిజముగా శరీర స్మారకమెరుగనిస్థితిలో నున్నట్లు చిహ్నాల గనిపెట్టితిని. ఒక పర్యాయము ప్రసిద్ధుడగుడాక్టరును కూడా సమీపమునసుంచుకొని పరిశీలింపగా నాయనయునూ నిజమగుసమాధిస్థితియే

యని తీర్మానించెను. భువర్లోకవాసు లనేకులు, మేమెన్నడునూ యెరుగనివారువచ్చి వార్తలను వ్రాసిరి. అందుగొన్నివర్తమానము లుత్తరహిందూస్థానమున మరణించినబంగాళీయువతిచే నత్యద్భుతముగా వ్రాయబడినవి. వాటినిజానిజములు బహు జాగరూకతతో విమర్శించితిమి. ఇందునుగురించి యెక్కువతబిశీలుగా వ్రాయుట కవకాశము లేదు.

3. Automatic writing:—"ప్రయత్నము లేనివ్రాత" ఈశక్తిగలవారు పరిపూర్ణస్పృహతోనుండియే వ్రాయుదురు. దీనివిధాన మెట్లనగా: ఎదుట కాగితములను పెనసల్‌ను పెట్టుకొని కూర్చుందురు. అప్పుడు తమకుడిచేతియందు వ్రాయుశక్తిని తగ్గించి (devitalise) వ్రేలాడిపోవునట్లు తమస్వాధీనములో నుంచి వదలివేయుదురు అట్టిస్థితిలో, 'భువర్లోకదూత' నాచేతి నావహించి, 'సూక్ష్మశక్తి' నుపయోగించుచు, చేతిలో పెనసల్‌ను పట్టుకొని కాగితములపై వ్రాయును. ఆసమయములో చేయి "మీడియం" స్వాధీనములో నుండదు; వ్రాయు నంశములునూ నాతని కేమియూ తెలియవు. ఇది భువర్లోకదూతలు సామాన్యముగా నుపయోగించువిధానమైయున్నది.

4. Table lifting—'బల్లను పైకెత్తుట.' ఒకచిన్న బల్లచుట్టునూ కొందరు స్త్రీలును పురుషులును,పురుషులుమాత్రమైననూ సరే, కూర్చుని తమచేతులను తగిలీతగలనట్లు బల్లపై నుంచుదురు. వీరిలో నెవరైననూ సూక్ష్మశక్తిగలవాడున్న యెడల భువర్లోకదూత యాసూక్ష్మశక్తి నుపయోగించి బల్ల

కొడునొకదానిని పైకెత్తును. అప్పుడు మన మడుగు ప్రశ్నలకు జవాబులు చెప్పును ఒక్కొక్క యక్షరమును మన ముచ్చరించుచో, సరియగు నక్షర ముచ్చరించినపుడు బల్ల కాలును నేలపై గొట్టును. ఇట్లొక్కొక్క యక్షరమునే దగ్గరవారు వ్రాసికొనవలెను. అవియన్నియు కలిపి చదువుకొనినచో మన ప్రశ్నకు జవాబు వచ్చును. సాధారణముగా పురుషుల కంటె స్త్రీలలో సూక్ష్మశక్తి యెక్కువ యుండును. ఇది యంతనమ్మతగిన పద్ధతి కాదు.

5. Planchette writing:—ఇది యొక మాదిరియంత్రము. దీనిలో నొకచిన్న పెనసలును పెట్టి, ఒకబల్లపై తెల్ల కాగిత ముంచి, దానిపై నీయంత్ర మూంచి, యిద్దరు దానిపై చేతులు పెట్టి కూర్చుందురు. వారికి సూక్ష్మశక్తి యున్నయెడల 'భువర్లోకదూత' దాని నుపయోగించి ఆయంత్రముతో కాగితముపై వ్రాయును.

6. Materialization:—భువర్లోకవాసి స్థూలదేహముతో సాక్షాత్కరించుట: దీనినిగురించి వెనుకటిప్రకరణమున వ్రాయబడినది. ఈగొప్పశక్తి అందరు మీడియంసుకునూ ఉండదు. ఈశక్తిగల 'మీడియం', శరీరమునుండి 'సూక్ష్మజాత' మను (Ectoplasm) నొకపదార్థము బయలు దేరివచ్చును. అప్పుడు "మీడియం"కు స్పృహ తప్పును. ఆసూక్ష్మజాతముతో భువర్లోకదూత దేహమును నిర్మించుకొని దానిలో ప్రవేశించి స్థూలదేహముతో మనకు ప్రత్యక్ష మగును. ఆ

శ్రోత్రశరీరము నడచుటయు, మాటలాడుటయు జరగించును. కొంతసేపటి కాదేహము క్రమముగానదృశ్యమై 'సూక్ష్మజాతము' తిరిగి మీడియం శరీరములోనికిబోవును. ఒక్కొక్కప్పుడు పూర్తిగా శరీరమును నిర్మించుకొనక, ఒక చేతిని మాత్రమే నిర్మించుకొని దానితో ప్రత్యక్షముగా కాగితముపై వ్రాయును. అపుడు చూచువారి కాకచేయిమాత్రము దృశ్యమగును. కొన్ని సమయములలో నొక్కముఖమును మాత్రము నిర్మించుకొనును. ఈక్రియలను (Partial materialization) అందురు.

ప్రత్యక్షాకృతుల నొందిన భువర్లోక వాసులను ఫొటోగ్రాఫ్ తీయుటయు కలదు. (Spirit Photography).

ఇవియన్నియు భువర్లోక వాసులు మనలోకమునకువచ్చి చేయువిధానములు:—

వారి నీలోకమున కాకర్షింపక "మీడియం" ఆలోకమునకు పోయి సమాచారములను కనుగొను విధానము లనేకములు గలవు: ఇవి గొప్పశక్తులు. సామాన్యముగా నెవరికో కాని కలుగవు.

Clairvoyance:—జ్ఞానదృష్టి, దివ్యదృష్టి, సూక్ష్మదృష్టి యని చెప్పవచ్చును.

ఈదృష్టికలవారు భువర్లోకమును, భువర్లోకవాసులను చూడగలరు.

8. Clair audience:—'సూక్ష్మశ్రోత్రము' ('దివ్యశ్రోత్రము') ఈశక్తికలవారికి భువర్లోకవాసులమాటలు వినబడును.

ఈ రెండుశక్తులును కలసి యొకరియందే యుండుటయు కలదు.

9. Astral travelling:—'సూక్ష్మదేహవిహారము' లేక యిష్టమువచ్చినప్పుడు స్థూలదేహమునువదలి పూర్ణవ్యక్తితో సూక్ష్మలోకములలో విహరించి, తిరిగి యావ్యక్తినిపోనిచ్చుకొనక స్థూలదేహమునకు వచ్చుట. ఇది మహోత్కృష్టశక్తి. ఈశక్తినే మనవారు ఖేచరగమనమందురు. శ్రీశంకరాచార్యులవారీశక్తి నుపయోగించుచుండినట్లు వారిచరిత్రమువలన తెలియుచున్నది. ఇంకను ననేకవిధములగు దివ్యశక్తులు గలవు.

భువర్లోకవాసు లనేకులుగూడ ప్రదర్శనముల నిచ్చుట యు గలదు. అట్టిప్రదర్శనమందిరమును "Seance room" "సియాన్సుగది" యందురు. ఈప్రదర్శనములలో అనేకచిత్రవిచిత్రములగపర్చబడును మనకంటికెవరునూ కనబడకయే కుర్చీల నొకచోటనుండి మరియొకచోటికి మార్చుట; అనేక మణుగుల బరువుగల మేజాబల్లలను భూమినుండి చాలాపైకి యెత్తుట. ప్రదర్శనముచూచువారిలో నొకరిని భూమినుండి చాలాదూరము పైకెత్తుట (Levitation) చిత్రములగు కాంతులను కనుపర్చుట, మొదలగునవి ప్రదర్శింపబడును.

భువర్లోకమునుండి యీయబడిన వర్తమానములను స్వల్పముగా మచ్చున కిచ్చుట వ్రాసెదను. సామాన్యముగా

మొట్టమొదట వచ్చువర్తమానములు ప్రేమానుబంధమును దెలుపునవియై యుండును; మరియు, నాకలోకమాన సౌఖ్యముగా నున్నామనియు, దమకై విచారింపవలసినయగత్యము లేదనియు, దెలుపుచుండును. తర్వాతివార్తలు భువర్లోకవిషయములను జెప్పును.

ఒకయాంగ్లేయుభువర్లోకనాసి పంపినవార్తలు:—

"ఇక్కడ నాకు దయగలస్నేహితు లనేకులు సహాయము చేయుచున్నారు. నేను మొదట నిదుర లేచినతోడనే సౌఖ్యముగానుండగలుగుదునని తలంపలేదు. కాని యిప్పుడు సౌఖ్యముగా నున్నాను. ఇంకనూ యెక్కువసౌఖ్యము నొందబోవుచున్నాను. నేనిక్కడ చేయవలసినపని చాలాకలదు. నాకు బోధపరచువారును, గురువులును కలరు. ..."

"మొట్టమొదట నే నెక్కడనున్నదియునూ తెలియలేదు. కాని నాకిది కొద్దికాలములోనే బోధపరచబడినది ..."

"నేను మిమ్ములను చూడగలను. మీరు నన్నుతలంచుకొనునపుడల్ల నేను మిమ్మును చూడగలను ... ..."

"నాప్రియమైనతల్లీ! నే నెంతసౌఖ్యముగా నున్నానను కొన్నావు! మీరుకూడా దుఃఖముమాని సౌఖ్యముగా నున్నందున నాసౌఖ్యము హెచ్చుచున్నది. ... ... నేను వచ్చినపుడు దుఃఖమనునది యుండకూడదు. ఒకసిట్టూరైన ను ఉండకూడదు. ... ..."

"నాశరీరము ఇదివరకున్న శరీరమును బోలియున్నది. ఇది నిజమైనశరీరమో కాదో కనుగొనుట కప్పుడప్పుడు నన్ను నేను గిల్లుకొని చూచుచున్నాను. కాని స్థూలశరీరమును గిల్లినప్పుడున్నట్లు బాధకనుపడదు శరీరముయొక్కలోపలి యవయవములు ఇదివరకు శరీరమునకువలె నగుపడవు. కాని పై యాకారముమాత్ర మిదివరకున్న శరీరమువలెనే యున్నది. నేను మునుపటికంటె నెక్కువవేగముగా బో గలను. నాకు చెవులును, కండ్లును గలవు. కనురెప్పలును కనుబొమలును, నాలుకయును, పండ్లును గలవు. ... ..."

"ఇక్కడ పిల్లలుపుట్టుట యనునది లేదు. పిల్లలను కను టకు భూలోకమునకు బోవలెను. ఇక్కడ అన్యోన్య ప్రేమ మాత్రము కలదు. భార్యాభర్తల కుండు ప్రేమ యొకనూ దిరిగా నుండును; మాతాశిశువుల కుండు ప్రేమ యింకొక మాదిరిగా నుండును. ఇక్కడ కావలసినపదార్థములన్ని యు దొరకును. క్రొత్తగా వచ్చినపిల్లవాడొకడు చుట్ట కావలెనని కోరెను. చుట్ట లిక్కడ దొరకవనుకొనునుగాని చుట్టవలెనే యుండునదొకటి తయారుచేసి వాని కివ్వబడి నది. వా డాశ్చర్యపోయెను. ఇక్కడ అన్నివస్తువులను తయారుచేయుటకు యంత్రశాలలు గలవు. కాని భూలోక మునందువలె ఘనపదార్థములతో తయారుచేయరు. వాటి తత్వములతో జేయబడును. ... ..."

"నేనిక్కడ చాలాఅంశములు చదువుకొనవలసియున్నది. నేను తిరిగి భూలోకమునకువచ్చుట కిచ్ఛగించనని చెప్పినచో నేను స్వార్థపరుడ నని తలంచెదవా? ఏమి యిచ్చిననూ సరే, ఇదివదలి రాను. నేను స్వార్థపరుడనని గాని, మిమ్ముల్లను వదలియుండుట నాకిష్టమనిగాని తలంపకుము. మీరింకనూ నాయొద్దనే యున్నారు. బహుసమీపమున నున్నారు. నాకెవరేమిచ్చిననూసరే నేనురాను-రాను...',

భువర్లోకములో నున్నకుమారునకును, భూలోకమున నున్నతండ్రికినీ సంభాషణ జరిగెను. తండ్రి ప్రశ్నలడుగుటయు, 'ఆటోమేటిక్ వ్రాత' (Automatic writing) చేత కుమారుడు జవాబులు వ్రాయుటయూ జరిగెను.

కు॥ "తండ్రీ! నేనెంతో సేపటినుంచి యిక్కడ కనిపెట్టుకొని యున్నాను."

తం॥ "నాప్రియపుత్రుడా!"

కు॥ "ప్రియమైనతండ్రీ! నేను తలంచునదంతయూ చెప్పజాలను. నీయెడల నాకు మిక్కుటమగుప్రేమ కలదు. నాయనా! నాతో మాట్లాడుము."

తం॥ "అబ్బాయీ! నే నెరుగుదును. ఇంట్లో మనవారి కేమైనా కబుర్లుచెపుతావా?

కు॥ "నే నీవాళ అక్కడనే యుంటిని. అమ్మతో మాట్లాడితిని కాని యామెకు నామాటలు వినపడినవో లేదో తెలి

యుడు. కాని వినపడినదనుకుంటాను. ఈమాట లమ్మతో చెప్పి నాముద్దుల నామెకిమ్ము."

తం॥ "మీయమ్మకు నీవు నిన్న కలలో స్పష్టము నగపడినావు. అది నిజమో, కలయో తెలియదు."

కు॥ "నన్నామె చూడగలుగునని తలంచెదను. ఎందుచేత నంటే తరుచు ఆమెసమీపముననే ఉంటూవున్నాను."

తం॥ "అబ్బాయీ! క్రిస్టమస్ వస్తూవున్నదని తెలుసునా?"

కు॥ "తెలుసును. నేను మీయొద్దనుండెదను. కాని మీరు సంతోషముగా నుండవలెను. లేకపోతే నాకు బాధ కలుగును. మీరు సంతోషముగా నుండుట కష్టమని తెలుసును గాని, నేనెంత సౌఖ్యముగా నున్నానో మీకీపాటికి తెలిసియుండునే! క్రిస్టమస్‌రోజున నొకనిముసమైననూ ఇల్లువదలి వెళ్ళను ... ..."

"ఇక్కడ, యేస్థానమున కెవరు తగియున్నారో ఆస్థానమునకు వారంతటవారు దిగుదురు. ఇట్లు వేరువేరుస్థానములకు దిగుటకు విచారకర్త యెవరునూ లేరు. వారంతటవారే దిగుదురు. దుర్వ్యసనములు గలవారుకొందరు, పోయినస్థానము చూచినాను. అట్టిస్థానమునకు నేను పోవలసినపనిలేదని సంతోషించుచున్నాను.........భూలోకమునందలియున్నతపదవులిక్కడ లెక్కలోనికి రావు. ఇక్కడ నున్నతపదవి సత్ప్రవర్తనవలన వచ్చును ... ..."

పైనవ్రాయబడినవన్నియు నింగ్లండు దేశములో నందు కొనబడినవర్తమానములు.

ఉత్తరహిందూస్థానములో నొక మహారాష్ట్రయువతి భర్తకు వ్రాసినవి:—

"నాపేరు...... నేను సర్వదా నీతోనే యున్నాను. నన్ను గురించి చింతింపవలదు......నాకొరకు యేడువకూడదు. పరిశుద్ధమైనజీవితమును గడుపుము ......దానధర్మములు చేయుటవలన నాకు ఆనందము గలుగును.......నిశ్చయముగా నీవిచారమువలన నాకు తొందర కలుగుచున్నది. ......నీవు పునర్వివాహము చేసుకొని సుఖించెదవు. నీవు పునర్వివాహము చేసుకొనవలెననే నాయభిప్రాయము. ... భూలోకవాసులు భువర్లోకవాసులతో ప్రసంగించుటకు తంటాలుపడుచున్నట్లే, భువర్లోకవాసులునూ భూలోకవాసులకై ప్రయత్నించుచున్నారు. ... ..."

"నిన్న నేను రాకపోవుటకు కారణమేమనగా, దీక్షలో నున్నాను. ఇప్పుడునూ మాటలాడుటకు వ్యవధిలేదు. పూజకు వెళ్ళవలసియున్నది.......ఈలోకవాసులు ప్రతిదినమును భగవత్పూజ చేయుదురు.......ఇక్కడ పిల్లలకు చావను నది లేదు."

"మనపిల్ల...... (భువర్లోకవాసి) నాయొద్దనే ఉన్నది. క్షేమముగా నున్నది. ... ..."

"... ...(ఇంకొక భువర్లోకవాసి) బహునీరసముగా నున్నది. ఆమెకు వ్రాయుటకు శక్తిలేదు. ఆమె మూడుకోర్కెలు తెలియపరచవలెనని కోరుచున్నది. మొదటి దేమనగా ... (ఆమెభర్త) తిరిగివివాహము చేసుకొనకూడదని. రెండవది, తనమనసెప్పుడును తనకూతురుపై నున్నదని ... ... తనకు చాలా ఆకలిగానున్నది. ముగ్గురుస్త్రీలకు భోజనములు పెట్టి బహుమతు లియ్యవలెను. అవి తనకు చేరును. ... ... అసి"

ఒకమహారాష్ట్రపురుషుని వార్తలు:—

"నేను బహుసౌఖ్యముగా నున్నాను ... ... నే నిప్పుడున్న లోకములోనివిషయము లన్నియు వర్ణించుటకు వీలులేనంత చక్కగానున్నవి. ఈలోకవాస్తవ్యులు బహుసౌఖ్యముగా నున్నారు. ఎవరివృత్తులను వారు చేసుకొనుచున్నారు. వ్యవసాయము చేయుచున్నారు, రైలుబళ్ళు నడుపుచున్నారు, ఇళ్ళు కట్టుచున్నారు ... ... ఇళ్ళు రాయి, యిటుకలతో కట్టరు. మనస్సంకల్పముచే కట్టుదురు. ... ... ఇక్కడ పిల్లలు ఎదుగుచుందురు. మీరుకూడా యిక్కడకు వచ్చినప్పుడు మిమ్ముల నానవాలు పట్టగలరు.

ప్ర॥ మనయెడబాటునకు మీకు విచార ముండునా?

జ॥ ఉండును.

ప్ర॥ మీరు మమ్మును చూడగలరా?

జ॥ చూడగలము.

ప్ర॥ అయితే విచార మెందుకు ?

జ॥ మీరును, మేమునూ కలసి స్థూలశరీరములతో లేనందుకు.

ప్ర॥ నీస్థూలశరీరమును మరచిపోలేదా ?

జ॥ లేదు. ... ..."

భూలోకములో నున్నయొకయాంధ్రుపకును, భువర్లోకములోని వానిబంధువునకునూ జరిగినసంభాషణ:—

"ప్ర॥ ఆలోకమున నన్నితెగలవారునూ ఒకచోటనే యుందురా ?

జ॥ అవును.

ప్ర॥ ఒక స్త్రీయొక్కయాత్మమరణానంతర మెక్కడికిపోవును ? భువర్లోకమున నున్నభర్తను కలియునా లేదా ?

జ॥ ఆకాశము — కర్మ.

ప్ర॥ ఆమె స్వచ్ఛమగుపవిత్రవర్తన గలది యనుకొమ్ము ?

జ॥ సంయోగము.

ప్ర॥ ఆమె దుష్ప్రవర్తనగలది యైనచో ?

జ॥ వియోగము. ... ..."

ఒకయుత్తరహిందూస్థానవాస్తవ్యుని వార్తలు:—

"నే నిపుడాంచీటిపరిదేశములో నున్నాను ... ... నేను సత్ప్రవర్తనగలవాడను కాఁపోయినను మరణకాలమందు నాకు దివ్యదృష్టి కలిగినది. భూలోకమును, భువర్లోక

మునూఁగూడ కనుపడుచుండెను. నాజీవితమంతయూ మంచిపనులు, చెడ్డపనులుగూడ నాయెదుట గోచరించినవి. ... ... తుదకు నాకు స్పృహ పూర్తిగా పోయినది. తర్వాత తిరిగి తెలివివచ్చినది. నేను చనిపోయినట్లు పూర్తిగా గ్రహించలేకపోయినాను. నేను కలగనుచున్నవానివలె నుంటిని. ... ... "

ఒకయాంధ్రయువతి తనభర్తకు వ్రాసినది:—

"నామనోహరా! మొగమెత్తి నన్నుచూడుము. నేను వచ్చినాను. మనోవ్యాకులత నొందవద్దు. అంతవిచారముగా నున్నారేమి? ఏమికారణము? మీనయనములలో భాష్పములు కనుపడుచున్నవే? మీరిక్కడనుండవద్దు. మీతల్లిదండ్రులయొద్దకు బోయి వారికి శుశ్రూషచేయుచు విచారమును మరవుము. త్వరగా పునర్వివాహము చేసికొనుము. ... ... శ్రార్ద్ధములు గతించినవారికి ముందుగతులు చూపుటకు చేయబడును ... ... నాయవసానసమయమున నాకనులకు మీరు తప్ప ఇంకేమియునూ గనుపడలేదు. ... ... నాజీవితమంతయూ నాయెదుట నాటకమాడినట్లు కనుబడినది. ... ..."

ఒకక్రిస్టియన్ యువతి వ్రాసినది:—

"మరణమనగా నేమియూ భయపడవలసినది కాదు. పరిశుద్ధముగు జీవనమును గడపుము. అట్లయినచో అంత్యమున దివ్యశరీరములతో నీభువర్లోకబాంధవులు నిన్ను చు

ట్టుకొని నీకు స్వాగత మిత్తురు. ... ...భూలోకములో నె పుడునూ వినని గానము నిక్కడ విందువు. భూలోకములో నెన్నడునూ చూడని వైభవము నిక్కడ జూతువు. నీ వెక్క డకు బోయిననూ వర్ణనాతీతము గురంగులునూ, సౌందర్య మునూ నిన్ను చుట్టియుండును భూమిలో నెన్నడూ నెరుగని మనోని ర్మలత్వమును రుచిచూడగలవు. ......"

తొమ్మిదవ పరిశరణము.

ముగింపు.

శ్లో॥ నష్టో మోహః స్మృతి ర్లబ్ధా ।
త్వత్ప్రసాదా న్మ యాచ్యుత ।
స్థితోస్మి గతసన్దేహః ।
కరిష్యే వచనం తవ॥ భగవద్గీత_అ18_73.

"ఓశ్రీకృష్ణస్వామీ నీయనుగ్రహమువలన నాచేత జ్ఞాన ముపొందబడినది. అజ్ఞానముపోయినది. సందేహముపోయి నవాడనై యున్నాను. నీయొక్క మాటను నెరవేర్చెదను."

నే వ్రాయదలంచినవిషయము ముగిసినది. మృతినొం దినమనప్రియులు సజీవులై యున్నా రనియు, మనలను ప్రే మించుచున్నా రనియు, మనము వారలను కలుసుకొనగల

మనియు జీవిహారాంశము. ఇయ్యది, మరణముయొక్కయు, తదనంతరదశలను గురించియు నిజస్థితి దెలుపుటచే, నీవిషయములయందు సామాన్యముగా గలదురభిప్రాయములను వాపుటయే గాక, శోకపీడితులకు దుఃఖోపశమనము గావించునని తలంచెదను ఈచిన్నపొత్తము మనలకందరకును ముందు ప్రాప్తములు గాదగియున్న గతుల నించుక వెల్లడించుటచే, సద్వృత్తిగలవారి నింకను నెక్కుడగు సద్వ్యాపారములయందు బురికొల్పుటయేగాక, దుష్టచింతగలవారికి పాపభీతినిగలిగించి కొంతవరకైనను దుర్వ్యాపారములనుండి మరలించి నీతిబోధకముగా నుండునని కూడ నెంచెదను. ఇందలివిషయములు గొన్ని పూర్వాచారపరాయణులనమ్మికల ... ...కు భిన్నములుగా నుండవచ్చును. అట్టివారవి యంగీకరించినను అంగీకరించకపోయినను, ఇయ్యవి నవీనశాస్త్రోక్తవిధానములచే బరిశీలింపబడి స్థిరపరుపబడినవగుటచే వీటియాథార్థ్యమునకు గొరంత రానేరదు.

పరిసమాప్తి.

కన్యాశుల్కము.

మూడవకూర్పు.

అచ్చుపడిసిద్ధముగానున్నది.

ఇది గురజాడ అప్పారావుపంతులుగారు బి యే. వారిచే రచియింపబడిన చక్కని నాటకము. దీనిననేకమంది నాటకులు ప్రదర్శించి మెప్పుఁబడసిరి

రెండవకూర్పు ప్రతులన్నియు ముద్రింపఁబడిన నెల రోజులలోనే విక్రయింపఁబడి యుండుటచే నిప్పుడు మూఁడవ కూర్పు ముద్రింపఁబడి విక్రయమునకు సిద్ధముగానున్నది. అనేక పట్టణములయందలి నాటకసమాజములవారిచేఁ బ్రదర్శింపఁబడి యందఱి మనస్సుల నాకర్షించి "కొనవలయును" "కొనవలయును" అనియువ్విళులూరించిన యీనాటకముయొక్క ప్రాశస్త్యమును గూర్చి యిప్పుడు నూతనముగా వర్ణించిచెప్ప నావశ్యకము లేదు.

ఇందలి గిరీశముపాత్రయొక్క పాటలు, చర్యలు, చదివి చూడవలసినదే కాని యిచట వ్రాయఁతరముకాదు.

కావలసినవారు కొండ్రా అచ్చయ్య అండ్ సన్సు రాజమండ్రి, వారికి వ్రాయవలయును.

ప్రకటన.

మరణము-భువర్లోకము.

ఈగ్రంథమువలయువారు శ్రీ చింతామణీముద్రాక్షరశాలాధికారులకుగాని లేక కొండ్రా అచ్చయ్యఅండ్ సన్సు రాజమండ్రి, వారికిగాని, వ్రాసికొనఁబడయఁగలరు.